ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కర్నూలు
జిల్లా వార్తలు

ఆదివారం 10 మార్చి 2024


అశేష జనవాహిని నడుమ కొనసాగుతున్న మల్లికార్జునస్వామి రథోత్సవం





బ్రహ్మోత్సవ రథంపై మల్లన్న

- అశేషంగా తరలి వచ్చిన భక్తులు
- శివ నామ స్మరణతో మార్మోగిన శ్రీగిరి
- పుష్కరిణిలో ఉత్సవమూర్తులకు తెప్పోత్సవం

శ్రీశైలం, మార్చి 9: శ్రీగిరిపై బ్రహ్మోత్సవ రథాన్ని అధిరోహించిన మల్లికార్జునుడు భ్రమరాంబ సమేతుడై అశేష భక్తజనం కోలాహలం నడుమ ఊరేగాడు. సాయంత్రం రథశాల వద్ద ఆలయ అర్చకులు రథానికి రథాంగ పూజ, రథాంగ హోమం, రథాంగబలి కార్యక్రమాలు శాస్త్రబద్ధంగా నిర్వహించారు. తదుపరి ఉభయ దేవాలయ ప్రాంగణంలో విశేష అర్చనలు, హారతులు అందుకున్న స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకిలో రాజగోపురం మీదుగా రథశాల వద్దకు మేళతాళాలు, భజంత్రీల నడుమ తోడ్కొని వచ్చారు. పుష్ప ప్రియుడైన మల్లయ్యకు సుగంధ పుష్పాలు, పరిమళ ద్రవ్యాలతో అలకంరించిన రథంపై అధిష్ఠింపజేసి సాత్విక బలిగా కొబ్బరి కాయలు, గుమ్మడికాయలను సమర్పించారు. గంగాధర మండపం నుంచి నంది మండపం దాకా, అక్కడి నుంచి తిరిగి గంగాధర మండపం వరకు రథోత్సవం సాగింది. రథం ముందు కోలాటం, చెక్కభజన, కేరళ కథాకళి, గొరవ నృత్యం, తప్పెట చిందు, కర్ణాటక జాంజ్, వీరగాసి, కొమ్మువాయిద్యం, నందికోలు సేవ, కంచుడోలు, బుట్ట బొమ్మలు, బీరప్పడోలు, పగటి వేషధారణ ప్రదర్శనలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

నేడు పూర్ణాహుతి

మహాశివరాత్రి బ్రహ్మోత్సవ క్రతువులకు ఆదివారం పూర్ణాహుతి నిర్వహిస్తారు. ఉదయం 9 గంటలకు యాగశాలలో పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించి అనంతరం కలశోద్వాసన, అవబృథం, త్రిశూలస్నానం, వసంతోత్సవం నిర్వహిస్తారు. సాయంత్రం ధ్వజావరోహణ చేయనున్నారు.


శ్రీశైలంలో పుష్కరిణిలో మల్లికార్జునస్వామి, భ్రమరాంబికా దేవి తెప్పోత్సవం

వైభవంగా తెప్పోత్సవం

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు ఆలయ పుష్కరిణిలో తెప్పోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా జరిపారు. కార్యక్రమంలో ముందుగా ఆలయ ప్రాంగణంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు షోడశోపచార పూజలు నిర్వహించారు. అనంతరం పుష్పాలంకృత పల్లకిలో ఊరేగింపుగా ఆలయం ఆలయ రాజగోపురం మీదుగా వెలుపలికి తోడ్కొని వచ్చి మేళతాళాల నడుమ పుష్కరిణి వద్ద ఏర్పాటు చేసిన తెప్పపై ఆశీనులను చేసి విశేష పూజాదికాలు చేశారు. అనంతరం మంగళవాయిద్యాల నడుమ వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా తెప్పోత్సవం జరిపారు.

కమనీయం.. కల్యాణం

- వేలాది మంది భక్తుల నడుమ వేడుక
- సింహ వాహనంపై ఊరేగిన మహానందీశ్వరుడు

మహానంది, మార్చి 9: మహానంది క్షేత్రంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం తెల్లవారు జామున మహానందీశ్వరుడు, కామేశ్వరీదేవి అమ్మవార్ల కల్యాణం వేలాది మంది అశేష భక్తుల మధ్య రమణీయంగా జరిగింది. కల్యాణ దాతగా వ్యవహరించిన నంద్యాలకు చెందిన లక్కబోయిన ప్రసాద్, ఆదిలక్ష్మమ్మ దంపతులు కుటుంబ సమేతంగా ఆలయం ముఖ మండపం వద్దకు పట్టు వస్త్రాలను తీసుకొచ్చారు. వీరికి ఆలయ ఈవోతోపాటు వేదపండితులు ఆహ్వానం పలికారు. ప్రధాన ఆలయాల్లో పూజలు నిర్వహించిన అనంతరం పట్టు వస్త్రాలను దాతలు ఆలయ ఈవోకు అందజేశారు. తెల్లవారుజామున 3 గంటల నుంచి వేదపండితులు కల్యాణం ప్రారంభించారు. మహానందీశ్వరుడు, కామేశ్వరీదేవి ఉత్సవమూర్తుల విగ్రహాలతోపాటు పెళ్లి పెద్దగా వ్యవహరించిన బ్రహ్మనందీశ్వరుడు, గంగాదేవి ఉత్సవమూర్తుల విగ్రహాలను మేళాతాళాలతో ఆలయం ప్రాంగణంలోకి తీసుకొచ్చారు. శిరివెళ్ల మండలం గుండంపాడుకు చెందిన ముక్కమల్ల వంశస్తులతోపాటు దొర్నిపాడు మండలం గుండుపాపలకు చెందిన గంగవరపు వంశస్తులు కల్యాణానికి పెళ్లి పెద్దలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఉత్సవాల ప్రత్యేక అధికారి పట్టెం గురుప్రసాద్, ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్‌రెడ్డి, సిబ్బంది, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సింహ వాహనంపై మహానందీశ్వరుడి విహారం: ఉత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం మహానందిలో సింహ వాహనంపై ఉత్సవమూర్తులకు వైభవంగా గ్రామోత్సవం జరిపారు. రాత్రి 9 గంటలకు పుష్ప పల్లకి సేవను నిర్వహించారు. ఉత్సవం ముందు మేళతాళాలతో పాటు తప్పెట్లు, కేరళ కళాకారుల వాయిద్య నృత్యం ప్రధాన ఆకర్షణగా నిలిచింది.


కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు

నేడు రథోత్సవం : మహానంది క్షేత్రంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి రథోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్‌రెడ్డి శనివారం తెలిపారు. కల్యాణం జరుపుకున్న స్వామి, అమ్మ వార్ల ఉత్సవమూర్తులతో పాటు పెళ్లి పెద్దగా వ్యవహరించిన గంగా సమేత బ్రహ్మనందీశ్వరుని ఉత్సవమూర్తుల విగ్రహాలను ఊరేగిస్తున్నట్లు తెలిపారు.

కల్యాణ వైభోగమే..

బనగానపల్లె, మార్చి 9: యాగంటి క్షేత్రంలో రెండో రోజు శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఉమా మహేశ్వరస్వాముల వారి కల్యాణోత్సవం శనివారం తెల్లవారు జామున వైభవంగా జరిగింది. కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు వివిధ గ్రామాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. వేదపండితుల సమక్షంలో ఆలయ ఈవో చంద్రశేఖర్ రెడ్డి, ఆలయ ఛైర్మన్ తోట బుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో కల్యాణోత్సవం అత్యంత రమణీయంగా నిర్వహించారు. మహా శివరాత్రి లింగోద్భవం అనంతరం ప్రధాన అర్చకులు మహేశ్వరశర్మ, కిశోరయ్య, లోకనాథశర్మ, రాఘవేంద్రశర్మ సంయుక్తంగా కల్యాణోత్సవం నిర్వహించారు. ఈ సందర్భగా పలువురు భక్తులు ఉమా మహేశ్వరస్వామి వారికి కానుకలు సమర్పించారు. సాయంత్రం నందికోల ఉత్సవం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఉమామహేశ్వర స్వామి కల్యాణోత్సవం సందర్భంగా వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులకు ఆలయ పరిధిలోని పలు అన్నదాన సత్రాల్లో భోజన వసతి కల్పించారు.


యాగంటిలో ఉమామహేశ్వరస్వామి కల్యాణోత్సవం

త్వరలో ఎన్నికల నోటిఫికేషన్

- ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలి
- అధికారులకు కలెక్టర్ జి.సృజన

కర్నూలు(కలెక్టరేట్), మార్చి 9: 'త్వరలో ఎన్నికల నోటిఫికేషన్ విడుదలవుతుంది. ఎన్నికల నిర్వహణకు అన్ని విధాలా సిద్ధంగా ఉండాలి. ఎక్కడా ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదు...' అని కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులను అప్రమత్తం చేశారు. శనివారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో సార్వత్రిక ఎన్నికల సన్నద్ధతపై రిటర్నింగ్, నోడల్ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే వారంలో ఎప్పుడైనా రావొచ్చని అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లా స్థాయిలో ఎన్నికల విధుల నిర్వహణకు నోడల్ అధికారులను నియమిచండం జరిగిందన్నారు. నియోజకవర్గాల వారీగా నోడల్ అధికారులను నియమించుకోవాలని ఆర్వోలను ఆదేశించారు. మెటర్నిటి లీవు, సీరియస్ హెల్త్ కండీషన్స్ ఉన్న వారికి పోలింగ్ విధుల నుంచి మినహాయింపు ఉంటుందన్నారు. ఎవరైనా ఎన్నికల విధుల నుంచి మినహాయింపు కోరేవారు ఉంటే వారి కోసం ప్రత్యేకంగా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సెల్‌లో తెలియజేయాలన్నారు. మీడియా ప్రతినిధులకు మంగళవారం వర్క్‌షాపు ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, ఆదోని సబ్ కలెక్టర్ శివనారాయణ శర్మ, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జి. సృజన, జేసీ మౌర్య

రేపు 'స్పందన'

కర్నూలు(కలెక్టరేట్), మార్చి 9: కర్నూలు కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో సోమవారం జరిగే స్పందన కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో, మున్సిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా స్పందన కార్యక్రమం జరుగుతుందన్నారు.

కలిసొచ్చిన కులం

- కర్నూలు వైసీపీ సమన్వయకర్తగా బీవై రామయ్య
- అనూహ్య పరిణామాల నేపథ్యంలో అవకాశం
- జగన్‌ను నమ్ముకొని నష్టపోయిన కప్పట్రాళ్ల బొజ్జమ్మ



కర్నూలు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): కర్నూలు పార్లమెంట్ వైసీపీ సమన్వయకర్త (రానున్న ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి)గా కర్నూలు నగర పాలక సంస్థ మేయర్ బీవై రామయ్యను ఆ పార్టీ అధిష్ఠానం తాజాగా ప్రకటించింది. వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన ఆయనకు తన కులం బాగా కలసివచ్చింది. ఈ నేపథ్యంలో ఆయనకు టికెట్ ఖరారైంది. క్యాస్ట్ కార్డ్ కలసివచ్చినా జిల్లాలోని మెజార్టీ ఎమ్మెల్యేల నుంచి ఆయన తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొంటున్నారు. 2019 ఎన్నికల్లో చేనేతల్లో పద్మశాలి సామాజికవర్గానికి చెందిన డాక్టరు ఎస్.సంజీవ్‌కుమార్‌కు వైసీపీ టికెట్ ఇస్తే ఎంపీగా నెగ్గారు. అయితే ఆలూరు ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రస్తుత మాజీ మంత్రి గుమ్మనూరు జయరాం ఓడిపోతాడనే సర్వేలు ఆధారంగా ఆయనను ఎంపీగా పోటీ చేయాలంటూ సీఎం జగన్ సూచించారు. ఆలూరు నియోజకవర్గం వైసీపీ సమన్వయకర్తగా చిప్పగిరి జడ్పీటీసీ బి.విరుపాక్షిని, కర్నూలు పార్లమెంట్ సమన్వయకర్తగా అప్పటి మంత్రి జయరాంను అధికారికంగా ప్రకటించారు. అయితే ఎంపీ టికెట్ ఆశిస్తున్న ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్ తనకు మాటమాత్రంగానైనా చెప్పకుండా ఎంపీ అభ్యర్థిని ప్రకటించడాన్ని సహించలేకపోయారు. వెంటనే ఎంపీ పదవికి ఆయన రాజీనామా చేశారు.

గుమ్మనూరు వ్యవహారంతో...

ఎంపీగా పోటీ చేసేందుకు ఏ మాత్రం ఇష్టం లేని మంత్రి గుమ్మనూరు జయరాం మొదటినుంచి వైసీపీపై ఎంపీ టికెట్ తన జేబులోనే ఉందంటూ వ్యంగాస్త్రాలు సంధించారు. అంటే.. ఎంపీగా పోటీ చేసేందుకు ఆసక్తి లేదంటూ అధిష్ఠానానికి ఆ రోజే సంకేతాలు ఇచ్చారు. ఈ నెల 5న మంగళవారం మంత్రి గుమ్మనూరు జయరాం మంత్రి పదవికి, వైసీపీ సభ్యత్వానికి రాజీనామా చేసి.. అదే రోజు సాయంత్రం మంగళగిరి వేదికగా జరిగిన జయహో బీసీ సభలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ సీఎం చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిపోయారు. అయితే జయరాం పార్టీని వీడే అవకాశాలు ఉన్నాయని ముందే పసిగట్టిన వైసీపీ వాల్మీకి (బోయ) సామాజికవర్గానికి చెందిన కర్నూలు మేయర్ బీవై రామయ్య పేరును తెరపైకి తెచ్చింది. ఆయనతో డబ్బులు లేవని, రాబోయే ఎన్నికల్లో ఒక్కో ఎమ్మెల్యే అభ్యర్థికి కనీసం రూ.10-15 కోట్లు ఇచ్చే ఎంపీ అభ్యర్థిని ఎంపిక చేయాలంటూ మెజార్టీ ఎమ్మెల్యేలు డిమాండ్ చేస్తున్నారు. అంతేకాకుండా సీఎం జగన్‌తో పాటు అభ్యర్థుల ఎంపికలో కీలకంగా వ్యవహరిస్తున్న సజ్జల రామకృష్ణారెడ్డి, ధనుంజయరెడ్డి దృష్టికి కూడా తీసుకెళ్లారు. అయినా కూడా వైసీపీ అధిష్ఠానం బీవై రామయ్య వైపు మొగ్గు చూపి కర్నూలు పార్లమెంట్ సమన్వయకర్తగా ఎంపిక చేసి అధికారికంగా ప్రకటించింది. నంద్యాల జిల్లా పాణ్యం నియోజకవర్గం గడివేముల గ్రామానికి చెందిన బీవై రామయ్య సివిల్ ఇంజనీరింగ్ పూర్తి చేశారు. ఆ తరువాత ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం కూడా చేశారు.




కప్పట్రాళ్ల బొజ్జమ్మకు జగన్ మోసం..!

ఆలూరు నియోజకవర్గం టీడీపీ నాయకురాలిగా ఉన్న మాజీ జడ్పీటీసీ కప్పట్రాళ్ల బొజ్జమ్మను సీఎం జగన్ వైసీపీలోకి చేర్చుకున్నారు. 'బొజ్జమ్మ తల్లీ.. నీవు ఆలూరు చూసుకోమ్మా..' అంటూ భరోసా ఇచ్చారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే టికెట్ బొజ్జమ్మకే అన్న ప్రచారం జోరుగా సాగింది. ఆమెను కాదని ఆలూరు వైసీపీ సమన్వకర్తగా విరుపాక్షిని ప్రకటించారు. ఎంపీగా పోటీ చేయడం లేదని గుమ్మనూరు జయరాం తేల్చిచెప్పడంతో.. వాల్మీకి సామాజికవర్గానికి చెందిన మహిళా నాయకురాలు బొజ్జమ్మకు ఎంపీ అవకాశం ఇస్తారనే ప్రచారం సాగింది. తాజాగా బీవై రామయ్యను ప్రకటించారు. టీడీపీలో ఉన్న బొజ్జమ్మను ఆలూరు టికెట్ ఆశ చూపి వైసీపీలో చేర్చుకుని తీరని అన్యాయం చేశాడని ఆమె వర్గీయులు ఆవేదన చెందుతున్నారు. తాజాగా మారుతున్న రాజకీయ పరిస్థితులు చూస్తుంటే.. ఆమె టీడీపీలో ఉండి ఉంటే.. వాల్మీకి కోటాలో ఆలూరు ఎమ్మెల్యే టికెట్ వచ్చేది. సీఎం జగన్‌ను నమ్మి వైసీపీలో చేరడం వల్ల రెండు విధాలుగా బొజ్జమ్మ నష్టపోవాల్సి వచ్చింది. విశ్వసనీయత గురించి తెగ బిల్డప్ ఇచ్చే సీఎం జగన్ బీసీ మహిళ కప్పట్రాళ్ల బొజ్జమ్మ విషయంలో ఏమైనట్లు అంటూ సర్వత్రా చర్చనీయాంశంగా మారుతోంది.

క్రైస్తవ ద్రోహి జగన్‌రెడ్డి

- చంద్రబాబుతోనే క్రైస్తవుల సంక్షేమం
- టీడీపీ రాష్ట్ర క్రిష్టియన్ సెల్ అధ్యక్షుడు స్వామిదాసు



సూపర్ సిక్స్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు

కర్నూలు(అర్బన్), మార్చి 9: జగన్మోహన్‌రెడ్డి పాదయాత్రలో క్రైస్తవుల పేరుతో అధికారంలోకి వచ్చి ద్రోహం చేశాడని టీడీపీ రాష్ట్ర క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు స్వామిదాసు ధ్వజమెత్తారు. శనివారం జిల్లా టీడీపీ కార్యాలయంలో జిల్లా క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు నేహమియా అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సూపర్ సిక్స్ పథకాల పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా స్వామిదాసు మాట్లాడుతూ 2019 ఎన్నికల ముందు జగన్ తాను క్రైస్తవుడ్ని అని, మీవాడ్ని అని క్రైస్తవులకు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చాక ఉన్న పథకాలను తొలగించారని విమర్శించారు. క్రైస్తవుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారని మండిపడ్డారు. చంద్రబాబు నాయుడు క్రైస్తవుల కోసం అమలు చేస్తున్న పథకాలకంటే రెట్టింపు పథకాలను అందిస్తానని హామీ ఇచ్చిన జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక క్రైస్తవులకు చేసింది శూన్యమన్నారు. పాస్టర్లకు గుర్తింపు కార్డులు, బీమా సౌకర్యం కల్పించడం, క్రిస్టియన్ కార్పొరేషన్ ప్రత్యేక గుర్తింపు ఇచ్చి ఆర్థికంగా బలోపేతం చేయడం, శ్మశాన వాటికల ఏర్పాటు, చర్చిలు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం, పాస్టర్లకు గౌరవవేతనం ఇవ్వడం మొదలైనవాటిని ఆరు పథకాల్లో టీడీపీ అమలు చేస్తుందని అన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వం రూ.100 కోట్లు క్రైస్తవుల అభివృద్ధికి ఖర్చు చేస్తే జగన్ ప్రభుత్వం కేవలం రూ.40 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందని గుర్తుచేశారు. సమావేశంలో రాష్ట్ర క్రిస్టియన్ సెల్ ఉపాధ్యక్షుడు బాబురాజ్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, ప్రసాదరావు, నగర అధ్యక్షులు నాగరాజు యాదవ్ పాల్గొన్నారు.

నందికొట్కూరులో యువకుల మధ్య ఘర్షణ

నందికొట్కూరు, మార్చి 9: పట్టణంలోని ఇద్దరు వ్యక్తుల మధ్య నెలకొన్న గొడవ కాస్త రెండు వర్గాలుగా విడిపోయి రాడ్లతో దాడులు తీసుకునే స్థాయికి చేరుకుంది. పట్టణంలోని హాజీనగర్‌కు చెందిన ఇర్ఫాన్ అనే యువకుడు బైక్ రేజ్ పెంచుతూ ద్విచక్రవాహనాన్ని నడిపాడంటూ మొదలైన గొడవ గురువారం మొదలై శుక్రవారం సంగయ్యపేటలో ఇరువర్గాలు ఒకరిపై ఒకరు రాడ్లతో దాడులు చేసుకున్నారు. ఈ దాడుల్లో ఇర్షాద్(18) అనే యువడికి తలపై బలమైన గాయాలు అయ్యాయి. కర్నూలులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్యులు ఆపరేషన్ చేసినట్లు తెలుస్తోంది. హరీఫ్, సంతోష్ అనే ఇద్దరికి దెబ్బలు తగిలాయి. ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్.ఐ రమణ తెలిపారు.

కాంట్రాక్టు ఉద్యోగులు ఇక రెగ్యులర్

- తొలి రోజు 129 మందికి ఆర్డర్స్‌ను అందించిన డీఎంహెచ్‌వో



నియమపత్రాలను అందజేస్తున్న డీఎంఅండ్‌హెచ్‌వో

కర్నూలు(హాస్పిటల్), మార్చి 9: 20 ఏళ్లుగా కాంట్రాక్టు ఉద్యోగుల నిరీక్షణకు తెర పడింది. రాష్ట్రంలో కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్న ఉద్యోగుల్లో అర్హులందరికీ రెగ్యులర్ చేస్తూ ప్రభుత్వం జీవో.నెంబర్.30, 31 విడుదల చేసింది. దీంతో వైద్యఆరోగ్యశాఖలో కాంట్రాక్టు విధానంలో వివిధ క్యాడర్లలో పని చేస్తున్న ఉమ్మడి జిల్లాలో 129 మందికి కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసులు రెగ్యులర్ అయ్యాయి. ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలో 167 మంది కాంట్రాక్టు ఉద్యోగులు, వైద్య ఆరోగ్యశాఖలో పని చేస్తున్నారు. శనివారం 75 మంది హెల్త్ అసిస్టెంట్లు (మేల్), 40 మంది ఫిమేల్ హెల్త్ అసిస్టెంట్లు, ఐదుగురు ల్యాబ్ టెక్నీషియన్లు, 9 మంది ఫార్మాసిస్టుల సర్వీసు రెగ్యులర్ అయిన వారిలో ఉన్నారు. డీఎంహెచ్‌వో డా.బి. రామగిడ్డయ్య, కార్యాలయ ఏవో కె. అరుణ, ఆఫీస్ సూపరింటెండెంట్ పత్తికొండ శ్రీనివాసులు, 129 మంది కాంట్రాక్టు ఉద్యోగులకు రెగ్యులరైజేషన్ ఆర్డర్స్ అందజేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో 167 మంది కాంట్రాక్టు ఉద్యోగుల్లో 129 మందికి శనివారం రెగ్యులర్ ఉద్యోగులుగా ఆర్డర్స్ ఇచ్చామని అన్నారు. మిగిలిన ఉద్యోగులకు త్వరలో రెగ్యులర్ ఆర్డర్స్ రానున్నట్లు తెలిపారు.

వైసీపీని వెనక్కి పంపడం ఖాయం

- జగన్ పాలనలో అవినీతి తప్ప.. అభివృద్ధి లేదు
- కేంద్ర మాజీ మంత్రి, టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి



డోన్‌లో పర్యటిస్తున్న కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి

డోన్, మార్చి 9: రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్న వైసీపీని రాబోయే ఎన్నికల్లో ప్రజలు ప్యాకప్ చేసి పంపడం ఖాయమని కేంద్ర మాజీ మంత్రి, టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని 14, 15 వార్డులలో ఆయన పర్యటించారు. ఇంటింటికి తిరిగి టీడీపీని గెలిపించాలని ఆయన ప్రజలను అభ్యర్థించారు. ఈ సందర్భంగా కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్ పాలనలో అవినీతి తప్ప ఎలాంటి అభివృద్ధి జరగలేదని విమర్శించారు. వైసీపీ పాలనలో ప్రతి పనికి కమిషన్లు దండుకుని జేబులు నింపుకున్నారే తప్ప ప్రజలకు ఒరిగిందేమీ లేదని ఆరోపించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులకు నిధులివ్వకుండా వైసీపీ ప్రభుత్వం రైతులకు తీరని అన్యాయం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి స్కీములో వైసీపీ నాయకులు ఇష్టారాజ్యంగా స్కాములకు పాల్పడ్డారని ఆరోపించారు. టీడీపీ అధినేత చంద్రబాబు పాలన రావాలని రాష్ట్ర ప్రజలంతా ఎదురు చూస్తున్నారన్నారు. డోన్ నియోజకవర్గ ప్రజలకు, ఆ పార్టీ కార్యకర్తలకు ఏ కష్టమొచ్చినా అండగా ఉంటానని కోట్ల స్పష్టం చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు వై. నాగేశ్వరరావు యాదవ్, కోట్రికే ఫణిరాజ్, వలసల రామక్రిష్ణ, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ టీఈ కేశన్నగౌడు, ఓబులాపురం శేషిరెడ్డి, మల్లి రమణ, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్, చిట్యాల మద్దయ్య గౌడు, శ్రీనివాస భట్, భాస్కర్ నాయుడు, ఆలేబాదు పరమేష్, చంద్రపల్లి ఆచారి, అన్వర్ బాషా, ఎస్ఎండీ రఫీ, ఎల్లగౌడు, జనసేన నాయకులు ఆలా మోహన్ రెడ్డి, దిలీప్‌రెడ్డి, పరదేశి మహేష్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి మహిళా హ్యాండ్‌బాల్ పోటీలకు హసీనా

కర్నూలు(స్పోర్ట్స్), మార్చి 9: ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రంలో హత్రాస్‌లో ఆదివారం నుంచి జరిగే 52వ జాతీయ స్థాయి మహిళల హ్యాండ్‌బాల్ పోటీలకు కర్నూలు జిల్లాకు చెందిన షేక్ హసీనా ఎంపికైనట్లు జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం ప్రధాన కార్యదర్శి డా.రుద్రారెడ్డి తెలిపారు. గతంలో జరిగిన రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభను కనబరిచి రాష్ట్ర జట్టుకు ఎంపిక కావడం శుభపరిణామమన్నారు. హసీనా ఎంపికపై జిల్లా సీనియర్ క్రీడాకారులు హర్షం వ్యక్తంచేశారు.



అడవి ఒడిలోకి పెద్ద పులి

- విజయవంతమైన చికిత్స
- రెస్క్యూ ఆపరేషన్ సక్సెస్
- పులి కోలుకోవడంతో నల్లమలలో వదిలిన అధికారులు
- నాగార్జున సాగర్-శ్రీశైలం టైగర్ రిజర్వు పరిధిలో అరుదైన ఘటన



అడవిలోకి పెద్దపులిని వదిలేస్తున్న దృశ్యం



కోలుకున్న పెద్దపులి ఇదే

ఆత్మకూరు, మార్చి 9: నాగార్జునసాగర్-శ్రీశైలం టైగర్ ప్రాజెక్ట్ పరిధిలో వేటగాళ్ల ఉచ్చులో చిక్కి తీవ్రంగా గాయపడిన పెద్దపులికి అటవీ అధికారులు వైద్యం చేయించి శుక్రవారం సురక్షితంగా నల్లమలలో వదిలారు. ఈ విషయం శనివారం అటవీ అధికారులు తెలిపారు. ఆత్మకూరు అటవీ రేంజ్ పరిధిలోని ముసలిమడుగు బీట్ పరిధిలోని సందుబాట రస్తాలో ఏర్పాటు చేసిన కెమెరా ట్రాప్స్‌లో మూడేళ్ల వయస్సు గల ఓ ఆడపులికి నడుము భాగంలో బైక్ క్లచ్ వైర్ లాంటి ఉచ్చు బిగుసుకొని తీవ్రంగా గాయపడినట్లు ఫిబ్రవరి 25న అటవీ అధికారులు గుర్తించారు. ఈ విషయం నేషనల్ టైగర్స్ కన్జర్వేషన్ అథారిటీ (ఎన్‌టీసీఏ) దృష్టికి వెళ్లడంతో రెస్క్యూ ఆపరేషన్ ద్వారా గాయపడిన పులిని బంధించి చికిత్స చేయించాలని సూచించారు. ఈమేరకు మహారాష్ట్రలోని పూణేకు చెందిన ఐదుగురు రెస్క్యూ టీంతో పాటు 50 మంది అటవీశాఖ ఉద్యోగులు, ప్రొటెక్షన్ వాచర్లు బృందంగా ఏర్పడి పులిని బంధించేందుకు రాత్రిపగళ్లు ప్రయత్నం చేశారు. ఎట్టకేలకు మార్చి 5వ తేదిన కొత్తపల్లి బీట్‌లోని అటవీ ప్రాంతంలో పులిని గుర్తించి ఎన్‌క్లోసర్ గన్ ద్వారా మత్తు మందు ఇచ్చారు. మత్తులోకి జారుకున్న పెద్దపులిని బోనులో ఎక్కించి వన్యప్రాణి సంరక్షణ వాహనంలో బైర్లూటిలోని వన్యప్రాణి వైద్య చికిత్స కేంద్రానికి తరలించి వైల్డ్‌లైఫ్ వెటర్నరీ డాక్టర్లచే చికిత్సలు అందించారు. నాలుగు రోజుల వైద్యం తర్వాత పులి కోలుకుంది. దీంతో పులిని శుక్రవారం రాత్రి నల్లమలలోని సురక్షితమైన అటవీ ప్రాంతంలో అటవీ అధికారులు వదిలేశారు. అడవిలో గాయపడిన పెద్ద పులిని గుర్తించి, వైద్యం చేయించి, తిరిగి అడవిలో వదలడం అరుదైన విషయమని అటవీ శాఖ ఉన్నతాధికారులు చెబుతున్నారు. కాగా ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అటవీ అధికారులు వెల్లడించారు.

పాపం చిరుత

- రోడ్డు దాటుతూ గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి



మృతి చెందిన చిరుతపులి

ఎమ్మిగనూరు, మార్చి9: ఎమ్మిగనూరు పట్టణ శివారులోని ఎస్ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో ఎమ్మిగనూరు-ఆదోని జాతీయ రహదారిపై శుక్రవారం అర్ధరాత్రి రోడ్డు దాటుతూ ఏడాది వయసున్న ఓ చిరుత పులి గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందింది. హనుమాపురం, గుడికల్ గ్రామాల సమీపంలో ఉన్న కొండల్లో నుంచి చిరుత అర్ధరాత్రి బయటికి వచ్చి రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొని మృతి చెందింది. సమాచారం అందుకున్న డివిజన్, జిల్లా అటవీశాఖ అధికారులు శివశంకర్ రెడ్డి, తేజస్విని, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని చిరుత పులి మృతదేహాన్ని పరిశీలించారు. నిబంధనల మేరకు ఒక కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ ఆధ్వర్యంలో కోటేకల్ అటవీ ప్రాంతానికి మృతదేహాన్ని తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. డీఎఫ్ఓ మాట్లాడుతూ డివిజన్‌లోని ఎమ్మిగనూరు, కోసిగి, ఆలూరు, ఆస్పరి, తుగ్గలి, హొళగుంద ప్రాంతాల్లో కొండలు, గుట్టలు ఉన్నాయన్నారు. ఈ ప్రాంతాలు చిరుతలకు నివాసయోగ్యంగా ఉన్నాయని వాటికి కావలసిన ఆశ్రయం, ఆహారం దొరుకుతుందన్నారు. కుక్కలు, మేకల కోసం బయటికి వస్తున్నాయన్నారు. ఇందులో భాగంగానే గుడికల్ కొండల్లో నుంచి చిరుతపులి బయటికి వచ్చి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిందన్నారు. ఈ ప్రాంతాల్లో ఉన్న గుట్టలు అన్ రిజర్వుడు ఫారెస్టులో ఉన్నాయన్నారు. సమీప గ్రామాల్లో ప్రజలకు అవేర్‌నెస్ కలిగించేందుకు కమిటీలు ఏర్పాటు చేశామన్నారు.



చిరుతపులి కనిపించకుండా అడ్డంగా పరదా కట్టి కాపలా ఉన్న అధికారులు

24రోజుల క్రితం గుడికల్ కొండల్లో : ఎమ్మిగనూరు మండల పరిధిలోని గుడికల్ గ్రామ కొండల్లో సంచరిస్తున్న చిరుత పులి మూగజీవాల కాపరుల ఉచ్చుకు చిక్కింది. అటవీ శాఖ అధికారులు చిరుతకు మత్తు మందు ఇచ్చి కాపాడారు. ఇప్పుడు మళ్లీ ఆదోని జాతీయ రహదారిపైకి రోడ్డు ప్రమాదానికి గురై మరో చిరుత పులి మృతిచెందింది. దీంతో ప్రజలు రాత్రి వేళల్లో ఇళ్ల నుంచి బయటకు రావాలంటే భయపడుతున్నారు. పొలం పనులకు వెళ్లడానికి ఆందోళన చెందుతున్నారు. గత కొంత కాలంగా కోటేకల్, మల్కాపురం, దేవిబెట్ట కొండల్లో చిరుత పులులు సంచరిస్తున్నా అధికారులు పట్టించుకోలేదు. మంత్రాలయం నియోజకవర్గంలోని కోసిగి కొండల్లో సైతం చిరుత పులులు సంచరిస్తున్నాయి. ఎమ్మిగనూరు మండలం గుడికల్ కొండల్లో "ఇంకా చిరుతలు ఉన్నాయా? అని సమీప గ్రామాల ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

మళ్లీ అదే నిర్లక్ష్యం..!

- అనుమతులు లేకుండానే కృష్ణా నదిలో మరబోట్ల సర్వీసులు
- పట్టించుకోని పోలీసు, రెవెన్యూ అధికారులు



సంగమేశ్వరంలోని కృష్ణానది జలాలపై అనుమతి లేకుండా నడుపుతున్న మరబోట్లు

ఆత్మకూరు, మార్చి 9: కృష్ణానదిలో మరబోట్ల నిర్వహణలో అదే నిర్లక్ష్యం కనిపిస్తోంది. శివరాత్రి ఉత్సవాల సందర్భంగా శ్రీశైలం వెనకతట్టు జలాల్లో భక్తులను పరిమితికి మించి మరబోట్లలో నిర్వాహకులు ఎక్కించుకున్నారు. మరబోట్లను నడిపేందుకు అనుమతులు లేనప్పటికీ కొందరు యధేచ్ఛగా సర్వీసులను కొనసాగిస్తున్నారు. దీనికితోడు పరిమితికి మించి ప్రయాణికుల్ని పడవల్లో ఎక్కించుని సొమ్ము చేసుకుంటున్నారు. శుక్రవారం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆవలి తెలంగాణ ప్రాంతానికి చెందిన భక్తులు క్షేత్రానికి పోటెత్తారు. అయితే సంగమేశ్వరానికి చెందిన మరబోట్ల నిర్వాహకులు ఎలాంటి భద్రతా చర్యలు తీసుకోకుండా భారీ సంఖ్యలో జనాన్ని పడవల్లో ఎక్కించుకుని నదీజలాలపై రాకపోకలు సాగించారు. ఒక్కో మరబోటులో 20 మందికి మించి ప్రయాణికుల్ని ఎక్కించుకోరాదు. అయితే బోట్ల నిర్వాహకులు ఒక్కో బోటులో 40 నుంచి 50 మంది వరకు ప్రయాణికుల్ని తరలించి సొమ్ము చేసుకున్నారు. సోమశిల నుంచి సంగమేశ్వరం నదీజలాలపై 2కిమీల దూరం ఉంటుంది. ఈ ప్రయాణానికి ఒక్కొక్కరి నుంచి రూ.100పైగా వసూలు చేసినట్లు తెలిసింది. కనీసం మరబోట్లలో లైఫ్‌జాకెట్లు లేకుండానే, భారీ సంఖ్యలో జనాన్ని తరలించారనే విమర్శలు ఉన్నా యి. గతంలో కృష్ణానదిలో అనుమతుల్లేకుండా మరబోట్లను నడిపితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించిన పోలీసు, రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వచ్చాయి. అధికార పార్టీ నాయకుల అండదండలతో బోట్లను నిర్వాహకులు నడిపినట్లు ఆరోపణలు ఉన్నాయి. అధికారులు స్పందించి సంగమేశ్వర పరిసర ప్రాంతాల్లో శ్రీశైలం బ్యాక్‌వాటర్‌లో అనుమతులు లేకుండా మరబోట్లను నడుపుతున్న వారిపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా వుంది.

బిందు సేద్యంపై దృష్టి పెట్టండి

- నీటి కొరత లేకుండా పంటలు సాగు చేయండి
- ఏపీఎంఐపీ పీడీ ఉమాదేవి

కర్నూలు(అగ్రికల్చర్), మార్చి 9: వర్షాభావం వల్ల పంటలకు సరిపడ నీరు అందుబాటులో లేని పరిస్థితుల్లో బిందు సేద్యం ఉపయోగకరమని, రైతులు దానిపై శ్రద్ధ పెట్టాలని డ్రిప్ ఇరిగేషన్ కర్నూలు జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ ఉమాదేవి సూచించారు. శనివారం కలెక్టరేట్‌లోని డ్రిప్ ఇరిగేషన్ ప్రాజెక్టు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ పత్తి, మిరప, టమోటా, ఉల్లి, వేరుశనగతో పాటు కూరగాయల పంటల్లో సూక్ష్మ సేద్యం వినియోగాన్ని పెంచాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డ్రిప్ ఇరిగేషన్ పథకాన్ని అమలులోకి తెచ్చాయని స్పష్టం చేశారు. రైతులు సాగు ఖర్చులు తగ్గించుకోడానికి, భూగర్భ జలాలను పొదుపుగా వాడేందుకు సూక్ష్మ సేద్యాన్ని అలవాటు చేసుకోవాలని అన్నారు. ఐదెకరాలలోపు రైతులకు 90 శాతం సబ్సిడీతో డ్రిప్ ఇరిగేషన్ ఏర్పాటు చేసుకునే అవకాశాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్నాయని, 5 నుంచి 10 ఎకరాల్లోపు రైతులకు 70 శాతం సబ్సిడీని అందిస్తున్నాయని తెలిపారు. ఈ సంవత్సరానికి 5వేల హెక్టార్ల బిందుసేద్యం లక్ష్యాన్ని చేరుకోవాలని నిర్ణయించామని అన్నారు. ఇప్పటికే 4,614 మంది రైతులు 4,335 హెక్టార్లల్లో బిందు సేద్యం పరికరాల ఏర్పాటు చేశామన్నారు. 2022-23 సంవత్సరంలో రూ.35.96 కోట్లు, 2023-24లో రూ.36.34 కోట్లు మొత్తం రెండేళ్లలోనే రూ.72.10 కోట్ల రాయితీని రైతులకు ప్రభుత్వం అందించినట్లు తెలిపారు. 2024లో డ్రిప్ పరికరాల ఏర్పాటుకు పెద్ద ఎత్తున చర్యలు చేపట్టామని, రైతులకు ఈ విధానంపై అవగాహన కల్పించేందుకు గ్రామ గ్రామాన తమ శాఖ అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకుంటున్నట్లు ఆమె తెలిపారు.

ఇదేనా సమన్యాయం?

- దళిత మహిళా సర్పంచ్‌కు అవమానం
- వివాదాస్పదంగా మారిన బుట్టా రేణుక వ్యవహార శైలి
- సోషల్ మీడియాలో వైరల్



హెచ్.కైరవాడి దళిత మహిళా సర్పంచ్‌ను కింద కూర్చోబెట్టి మాట్లాడుతున్న వైసీపీ సమన్వయకర్త బుట్టా రేణుక

గోనెగండ్ల, మార్చి 9: 'నా ఎస్సీలు.. నా ఎస్టీలు.. నా బీసీలు..' అంటూ ఎక్కడ మైక్ దొరికినా సీఎం జగన్ ఊకదంపుడు ప్రసంగాలు చేస్తుంటారు. బడుగు, బలహీనవర్గాలకు తనతో పాటు వైసీపీ నేతలందరూ గౌరవ మర్యాదలు ఇస్తుంటారని సీఎం జగన్ ప్రగల్భాలు పలుకుతుంటాడు. కానీ అందుకు భిన్నంగా క్షేత్రస్థాయిలో ఆ పార్టీ నేతల వ్యవహార శైలి విమర్శలకు తావిస్తోంది. తాజాగా ఎమ్మిగనూరు వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త బుట్టా రేణుక వైసీపీకి చెందిన దళిత సర్పంచులను అవమానించేలా వ్యవహరించారంటూ సోషల్ మీడియాలో వీడియోలు వైరల్ అవుతున్నాయి. మార్చి ఆరో తేదీన బుట్టారేణుక గోనెగండ్ల మండలం హెచ్ కైరవాడి గ్రామంలో పర్యటించారు. అదేరోజు గ్రామ పెద్ద అరుణమ్మ రెడ్డి నివాసంలో వైసీపీ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమయంలో బుట్టా రేణుకతో పాటు పెద్ద అరుణమ్మ రెడ్డి పైన కూర్చొని గ్రామ ప్రథమ మహిళ, దళిత సర్పంచ్ సూర్యపోగు సువర్ణమ్మను కింద కూర్చోబెట్టి మాట్లాడారు. ప్రస్తుతం ఈ ఫొటో నియోజకవర్గ వ్యాప్తంగా వైరల్‌గా మారింది.

విద్యుదాఘాతంతో యువ రైతు మృతి

క్రిష్ణగిరి, మార్చి 9: విద్యుత్ మోటర్ స్విచ్ ఆన్ చేస్తుండగా కరెంట్ షాక్‌తో క్రిష్ణగిరికి చెందిన కమ్మరి లక్ష్మణాచారి(27) శనివారం మృతి చెందాడు. క్రిష్ణగిరి రిజర్వాయర్ సమీపంలోని పొలానికి తండ్రి కమ్మరి నాగరాజు వెళ్లాడు. మోటర్ ఆన్ చేసి వస్తానని కొడుకు లక్ష్మణాచారి వెళ్లాడు. ఆ తర్వాత ఎంత సేపటికి కొడుకు రాకపోవడంతో నాగరాజు వెళ్లి చూశాడు. విద్యుదాఘాతంతో లక్ష్మణాచారి కరెంట్ మోటర్‌పై పడిపోయి కనిపించాడు. నాగరాజు కేకలకు చుట్టుపక్కల వాళ్ళు వచ్చి కరెంట్ సరఫరా బందు చేసి లక్ష్మణాచారిని బయటికి తీశారు. అప్పటికే అతను మృతి చెందాడు. మృతుడికి భార్య ఉంది. నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్పై చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

గడ్డివాములు దగ్ధం



చాగలమర్రి, మార్చి 9: మండలంలోని తోడెండ్లపల్లె గ్రామంలో టీడీపీ నాయకులకు చెందిన రామ్మోహన్‌రెడ్డి, ఓబుళరెడ్డికి చెందిన మూడు గడ్డివాములు దగ్ధమయ్యాయి. ఆళ్లగడ్డ అగ్నిమాపకదళ సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. దీంతో రూ.2.50 లక్షలు నష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు. తాము టీడీపీలో ఉండటంతో ఎవరో కక్షకట్టి ఈ దారుణానికి పాల్పడ్డారని వారు ఆరోపించారు. తమకు ప్రమాద బీమా ఇచ్చి ఆదుకోవాలని కోరారు.

ట్రాక్టర్ కింద పడి బీహార్ వాసి మృతి

పగిడ్యాల, మార్చి 9: మండల పరిధిలోని లక్ష్మాపురం అంచె సమీపంలో ట్రాక్టర్ ట్యాంకరు బోల్తా పడిన సంఘటనలో బీహార్‌కు చెందిన జయకాంత్ మాకియా(26) అనే వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన శనివారం జరిగింది. కొలిమిగుండ్ల నుంచి హైదరాబాద్ పోలార్ పవర్ గ్రిడ్ పనులు చేసేందుకు బీహార్ రాష్ట్రం పచాడి గ్రామానికి చెందిన కొంత మంది నెల కిందట లక్ష్మాపురం వచ్చారు. భాస్కరెడ్డికి చెందిన పొలం సమీపంలో ఏర్పాటు చేసిన విద్యుత్ టవర్ దిమ్మెలను జయకాంత్ ట్రాక్టర్ ట్యాంకర్‌తో క్యూరింగ్ చేశాక గుడిసె వద్దకు వస్తుండగా రోడ్డు మలుపు వద్ద ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో జయకాంత్ ట్రాక్టర్ టైరు కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. కాంట్రాక్టర్ అమిత్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నందికొట్కూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు ఎస్ఐ జయశేఖర్ తెలిపారు.

నీట మునిగి వ్యక్తి మృతి

కొలిమిగుండ్ల, మార్చి 9: కొలిమిగుండ్ల మండలం గొర్విమానుపల్లె గ్రామం సమీపంలో ఉన్న లొక్కిగుండంలో స్నానం చేస్తూండగా ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మారుతి(44) అనే వ్యక్తి శనివారం మృతి చెందినట్లు హెడ్ కానిస్టేబుల్ నరసింహులు తెలిపారు. తాడిపత్రి పట్టణంలో శివన్న నగర్‌కు చెందిన మారుతి లొక్కిగుండం శివాలయానికి వచ్చారు. నీటి గుండంలో దిగి స్నానం చేస్తుండగా ఈత రాకపోవడంతో ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు. మృతుని భార్య మహేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తునట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు

చంద్రబాబుతోనే సుపరిపాలన



టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

ఓర్వకల్లు, మార్చి 9: టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్రంలో సుపరిపాలన సాధ్యమని పార్టీ మండల నాయకుడు చదువుల సుధాకర్ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని పాలకొలను గ్రామంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీ అమలు చేస్తున్న మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. మంగళగిరి బహిరంగ సభలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ బీసీల కోసం పది సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టారన్నారు. కార్యక్ర మంలో రాజు, చంద్ర, సామేలు, అయ్యస్వామి, పురుషోత్తం, శివశంకర్, గుండమయ్య పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కేవీ సుబ్బారెడ్డి

కర్నూలు(స్పోర్ట్స్), మార్చి 9: స్థానిక ఆదర్శ విద్యామందిర్ క్రీడా మైదా నంలో 52వ రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ సీనియర్ పురుషుల చాంపియన్‌షిప్ పోటీలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను కేవీ సుబ్బారెడ్డి విద్యాసంస్థల చైర్మన్ కేవీ సుబ్బారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభిం చారు. 9 జిల్లాల నుంచి పోటీల్లో పాల్గొనగా.. సీనియర్ క్రీడాకారుల నుంచి అతిథులకు గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం క్రీడాకారులను పరిచ యం చేసుకుని క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలన్నారు. కార్యక్రమలో ఆదర్శ విద్యాసంస్థల వ్యవస్థాపకుడు బి.తిమ్మయ్య, రాష్ట్ర హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సి.శ్రీనివాసులు, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.రామాంజనేయులు, క్రీడా సంఘాల ప్రతినిధులు గంగాధర్, సువర్ణ కొండ పోగు సుంకన్న, చంద్రశేఖర్ రావు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం

కర్నూలు(స్పోర్ట్స్), మార్చి 9: స్థానిక అమ్మ వృద్ధుల ఆశ్రమంలో టీజీ గౌరమ్మ స్మారకర్థం శనివారం అన్నదానం చేశారు. ఈసందర్భంగా కర్నూలు మాజీ కార్పొరేటర్, జిల్లా రగ్బీ సంఘం అధ్యక్షుడు సురేంద్ర, టీజీవీ అసోసియేట్ ప్రతినిధి పరుశురాం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవా గుణాన్ని అలవర్చుకోవాలన్నారు. టీజీ గౌరమ్మ స్ఫూర్తితో మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేశ్ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించి అందరి మన్ననలను పొందా రని అన్నారు.

నిరాశ్రయులకు ప్రసాదం పంపిణీ

కర్నూలు(న్యూసిటీ), మార్చి 9: మహాశివరాత్రి పురస్కరించుకుని ప్రజాపరిరక్షణ సమితి అధ్వర్యంలో నగరంలోని పట్టణ నిరాశ్రయులు, వృద్ధులు, అనాథలకు ప్రసాదం పంపిణీ చేశారు. శనివారం సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కే.బలరాం, గౌరవ అధ్యక్షుడు పద్మానందయోగిలు వృద్ధులకు పాయసం అందజేశారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ పేదలను ఆదుకోవడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాది రంగడు, సుధాకర్, డేవిడ్, శివ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

జనసేన నాయకుల ఇళ్లలో సోదాలు సరికాదు



మాట్లాడుతున్న చింతా సురేష్‌బాబు

కర్నూలు(కల్చరల్), మార్చి 9: రెండు రోజుల క్రితం జనసేన పార్టీ కార్యాలయ సిబ్బంది, పవన్ కల్యాణ్ వ్యక్తిగత సిబ్బంది నివాసాల్లో రాత్రి పోలీసులు సోదాలు నిర్వహించడం సరికాదని జనసేన ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ చింతా సురేష్‌కుమార్ అన్నారు. శనివారం జనసేన పార్టీ కార్యాల యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోలీసులు ఎలాంటి నోటీసులు జారీ చేయకుండా ఇండ్లలో సోదాలు చేయడం చట్టవిరుద్ధమని అన్నారు. ఆదోని నియోజకవర్గ ఇన్‌చార్జి మల్లప్ప మాట్లాడుతూ కర్నూలు ఉమ్మడి జిల్లాలో జనసేన, టీడీపీ కూటమిలో ఒక్క అసెంబ్లీ సీటు జనసేనకు కేటాయించాలని పవన్ కల్యాణ్‌ను అభ్యర్థిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్ర మంలో ఉమ్మడి కర్నూలు జిల్లా అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జిలు, సమన్వయకర్తలు హర్షద్, రేఖాగౌడ్, ఎడవల్లి విశ్వనాథ్, నల్లమల్ల రవికుమార్, ఎం.మల్లయ్య, గడ్డం బ్రహ్మం, సీజీ రాజశేఖర్ పాల్గొన్నారు.

'బీజేపీని ఓడించాలి'

కర్నూలు(కల్చరల్), మార్చి 9: బీజేపీని ఓడించాలని దళిత్ సోషన్ ముక్తి మంచ్ (డీఎస్ఎంఎం) జాతీయ నాయకుడు జగ్గుల జాన్ వెస్లీ అన్నారు. శనివారం జడ్పీలోని ఎంపీపీ సమావేశ హాలులో భారత రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో ఆ సంఘం జిల్లా కన్వీనర్ ఆనం ద్‌బాబు అధ్యక్షతన 'దళిత క్రైస్తవులను ఎస్సీలుగా కొనసాగించాలి - మత స్వేచ్ఛను, మత సామరస్యాన్ని కాపాడాలి' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో కర్నూలు సెక్యులర్ ఫోరం నాయకుడు డి.గౌస్ దేశాయ్, కేవీబీఎస్ఎస్ చైర్మన్ జయకాంత్ క్రిస్టియన్, చర్చి బిషప్ మైఖేల్ టి మునేష్, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు దేవ సహాయం పాల్గొన్నారు.

మద్యం తరలిస్తున్న వాహనాలు సీజ్

కర్నూలు(అర్బన్), మార్చి 9: మద్యం తరలిస్తున్న వాహనాలు సీజ్ చేశామని సెబ్ సీఐ రాజేంద్రప్రసాద్ తెలిపారు. శనివారం పంచలింగాల చెక్ పోస్టు వద్ద అడిషనల్ ఎస్పీ టీ.నాగరాజు ఆదేశాల మేరకు సూపరింటెండెంట్ రవికుమార్ పర్యవేక్షణలో వాహనాలను తనిఖీ చేశారు. ఎదురూరు గ్రామానికి చెందిన బోయ శ్రీనివాసులు ఆటోలో 30 మద్యం బాటిళ్లు, కర్నూలు నగరం బాపూజీ నగర్‌కు చెందిన శివశంకర్ అనే వ్యక్తి బైక్‌లో తరలిస్తున్న మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశామని తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ రెహనాబేగం, ఆర్, పృధ్వీరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 15 కేసులు నమోదు

కర్నూలు, మార్చి 9: నగర శివారులో సుంకేసుల రోడ్డులో ట్రాఫిక్ పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 13 ద్విచక్ర వాహనదారులు, ఇద్దరు ఆటో డ్రైవర్లపై కేసులు నమోదు చేశారు. వీరి వాహనాలను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. వీరందరిని కోర్టులో హాజరు పరుస్తామని ట్రాఫిక్ సీఐ గౌతమి తెలిపారు.

రమణీయం.. బుగ్గ రామేశ్వరుని కల్యాణం

- భారీగా తరలివచ్చిన భక్తులు
- అలరించిన సినీ సంగీత విభావరి

ఓర్వకల్లు, మార్చి 9: కాల్వబుగ్గ రామేశ్వరస్వామి సన్నిధిలో మహాశివ రాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శనివారం తెల్లవారుజామున స్వామి, అమ్మవార్ల కల్యాణం రమణీయంగా జరిగింది. స్వామి, అమ్మవార్లకు కల్యాణ దాతలు శ్రీరాజ వెంకటచలమయ్య భార్య జయలక్ష్మమ్మ, మిట్టకందాల గ్రామ వెంక టేశ్వరరెడ్డి, ఎస్బీ మహిపతిరావు పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ ఈవో డీఆర్‌కేవీ ప్రసాద్ ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు కల్లె లక్ష్మీనారాయణ శర్మ, లక్ష్మీనరసింహ శర్మ, జంద్యాల ప్రసాద్‌శర్మ వేద మంత్రోచ్ఛరణాల మధ్య కల్యాణాన్ని నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై కల్యాణాన్ని తిలకించారు. అనంతరం భక్తులు స్వామి, అమ్మవార్లకు పెట్టుబడులు పెట్టారు. కాల్వబుగ్గలో శనివారం సాయంత్రం సింహవాహన, నందివాహన సేవలు, ప్రభోత్సవం వైభవంగా జరిగాయి. ఆలయ అర్చకులు కల్లె లక్ష్మీనారాయణశర్మ, లక్ష్మీనరసింహాశర్మ ప్రత్యేక పూజలు జరిపి ప్రభోత్సావాన్ని యథాస్థానంలో నిలిపారు.

● అలరించిన సినీ సంగీత విభావరి

కాల్వబుగ్గ రామేశ్వర స్వామి క్షేత్రంలో ఏర్పాటు చేసిన సినీ సంగీత విభావరి భక్తులను అలరించింది. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి హాజరై కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం శివునికి అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన పూజలు జరిపారు. అనంతరం విజయ ఈవెంట్స్ క్రియేషన్స్ హైదరాబాదు వారి ఆధ్వర్యంలో సింగర్స్ రూప, సినీ సింగర్ నందకిషోర్, జానపద జంగిరెడ్డి, డ్యాన్సర్ మాలతి, రేలారేలా గోపాల్, డ్యాన్సర్ చిన్న, సినీ సింగర్ రూప, విన్నర్ సూరి, సినీ సింగర్ సోమశేఖర్, విజ యలు పాడిన పాటలు, కళాకారులు వేసిన భక్తి నృత్యాలు భక్తులను అలరిం చాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భక్తిభావం అలవర్చుకోవాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జర గకుండా ఎస్ఐ రాజారెడ్డి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు కమిటీ సభ్యులు రామక్రిష్ణ, నాగరాజు, మహేశ్వరప్ప, ఆకుల రాజేష్, నాగతిరుపాలు, వెంగన్న, లోటర్ బాషా, గోప రమణారెడ్డి, మహేశ్వరరెడ్డి, రంగనాథగౌడు, నాగశేషులు, రామచంద్రుడు పాల్గొన్నారు. అలాగే మండలంలోని కన్నమడకల, నన్నూరు, ఉప్పలపాడు, హుశేనాపురం, శకునాల, హుడిచెర్ల, సోమయాజులపల్లె తదితర గ్రామాల్లో స్వామివారి కల్యా ణాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు కాయకర్పూరాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

కమనీయం.. శివపార్వతుల కల్యాణం

కర్నూలు(కల్చరల్): మహాశివరాత్రిని పురస్కరించుకొని శనివారం వేకువ జామునే కర్నూలు నగరంలోని వివిధ ఆలయాల్లో స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాలు, సాయంత్రం రథోత్సవాలను ఘనంగా నిర్వహించారు. నగర శివారులోని జగన్నాథగట్టుపై వెలసిన రూపాల సంగమేశ్వర స్వామి ఆలయంలో శనివారం తెల్లవారు జామున శివపార్వతుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. సాయంత్రం స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరింపజేసి, రథంపై ఆశీనింపజేసి, రథోత్సవాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను అలరిం పజేశాయి. ఈ సందర్భంగా కళాకారులకు ఆలయ ఈవో డి.ప్రసన్న లక్ష్మి జ్ఞాపికలు అందజేశారు. ఉత్సవాల నిర్వహణలో జగన్నాథ గట్టు అభివృద్ధి సమితి ప్రతినిధులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

● హరిహర క్షేత్రంలో.. నగరంలోని హరిహర క్షేత్రంలో శనివారం భవానీ సమేత రామలింగేశ్వర స్వామి వారికి అన్నాభిషేకం నిర్వహించి, భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. ఆలయంలో స్వామివార్లకు నందికోల సేవ బృందంచే కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. రాత్రి స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులతో రథోత్సవం నగర వీధుల్లో ఘనంగా నిర్వహించారు. నగర బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కల్లే చంద్రశేఖరశర్మ, హెచ్‌కే రాజశేఖరరావు, గౌరవ సలహాదారు హెచ్‌కే మనో హర్‌రావు పాల్గొన్నారు. పాతనగరంలో జమ్మిచెట్టు సమీపంలోని లలితా పీఠంలో లలితా సుందరేశ్వర స్వామికి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్యం స్వామి నేతృత్వంలో లక్ష బిల్వార్చన కార్యక్ర మాన్ని చేపట్టారు. అశోక్‌నగర్‌లోని ద్వారకామాయి, ఆంజనేయస్వామి ఆల యంలోని శివాలయం, కప్పల్‌నగర్‌లోని మల్లికార్జున స్వామి ఆలయం, సప్తగిరి నగర్‌లోని కైలాసగిరి తదితర శైవ దేవాలయాల్లో స్వామి అమ్మవార్ల కల్యాణం నిర్వహించారు.

వైభవంగా నీలకంఠేశ్వరుడి రథోత్సవం

గూడూరు: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని గూడూరులో వెలసిన భువనేశ్వరి నీలకంఠేశ్వరుడి రథోత్సవం శనివారం అశేష భక్తజనుల మధ్య వైభవంగా జరిగింది. గూడూరు పట్టణంలోని నీలకంఠేశ్వరుని ఆల యంలో స్వామి, అమ్మవార్లకు పూజారి నాగరాజు అభిషేకం తదితర పూ జలు నిర్వహించారు. భక్తులు, మహిళలు ఆలయానికి అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు తీర్చుకొన్నారు. సాయంత్రం నీలకంఠేశ్వరుడి రథోత్సవం ఘనంగా జరిగింది. చిన్నారుల కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. నందికోలశావ, వేషధారణ, భజనలు ఆకట్టుకున్నాయి.

చనుగొండ్లలో.. గూడూరు మండలం చనుగొండ్ల గ్రామంలో కేశవ, నాగ లింగేశ్వర, బసవేశ్వర స్వాముల రథోత్సవం నిర్వహించారు. శనివారం కేశవ, ఆలయంలో స్వామి వారికి పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకొన్నారు.



చనుగొండ్లలో..





కాల్వబుగ్గలో భక్తిపాటలు పాడుతున్న కళాకారులు, జగన్నాథ గట్టుపై నృత్యం చేస్తున్న బాలికలు



కాల్వబుగ్గలో స్వామి, అమ్మవార్లకు కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు



హరిహర క్షేత్రంలో..



జగన్నాథగట్టుపై రూపాల సంగమేశ్వర ఆలయంలో..



గూడూరులో నీలకంఠేశ్వర స్వామి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

సంపద సృష్టించే నాయకుడు చంద్రబాబు

కర్నూలు(అర్బన్), మార్చి 9: సంపద సృష్టించే నాయకుడు చంద్ర బాబు నాయుడని కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ అన్నారు. నగరంలోని ధర్మపేటలో టీడీపీ, జనసేన పార్టీ కార్యాలయాన్ని జనసేన ఇన్‌చార్జి అర్షద్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఐదేళ్లలో రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. ప్రజలందరూ కలిసి ఈ ప్రభుత్వాన్ని సాగనం పాల్సి ఉందని అన్నారు. తమ ప్రభుత్వం వస్తే రాష్ట్రంలో యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు యేసు, శివ, ప్రకాష్, విజయ్, భాస్కర్, జనసేన కార్యకర్తలు నాగరాజు, జనార్దన్, సురేష్, శ్రీనివాసరెడ్డి, రమేష్, మధు, శేఖర్, చంటి, కిరణ్ విజయ్ బూత్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

చిత్తారి వీధిలో టీజీ భరోసా యాత్ర : నియోజకవర్గ అభివృద్ధికి వందల కోట్లు ఖర్చు చేస్తే .. ప్రజలు సమస్యలతో ఎందుకు సతమతమవుతున్నారని టీజీ భరత్ ప్రశ్నించారు. నగరంలోని 5వ వార్డులో చిత్తారి వీధిలో టీజీ భరత్ భరోసా యాత్ర కార్యక్రమం చేపట్టారు. వార్డుకు వచ్చిన టీజీ భరత్‌కు ప్రజలు వారి సమస్యలు విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా టీజీ భరత్ మాట్లాడుతూ ఐదేళ్లపాటు అధికారంలో ఉన్న ప్రభుత్వం కనీసంగా అభివృద్ధి చేయలేదని అన్నారు. సరైన పాలకుడిగా లేకపోతే ఇలాంటి ఇబ్బందులే ఉంటాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బాలు, చెన్నారెడ్డి, రాజ్యలక్ష్మి, విజయలక్ష్మి, సురేష్, ఇం ద్రజ, జనసేన నాయకులు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న టీజీ భరత్



టీడీపీలో చేరిన వారితో టీజీ భరత్

టీజీ భరత్ సమక్షంలో టీడీపీలో చేరిక: నగరంలోని 22 వార్డుకు చెందిన హమీద్, నరేష్, వెంకటస్వామి, నాగరాజు, కుమార్‌లు వైసీపీని వీడీ కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత సమక్షంలో శనివారం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా టీజీ భరత్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ప్రజలంతా ఓటు హక్కును విని యో గించుకోవాలని, టీడీపీ నాయకులు, కార్యకర్తలందరూ ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చి ఓటు వేసేలా కృషి చేయాలని సూచించారు. టీడీపీ గెలిస్తే ప్రజ లందరికీ ఎంతో మేలు జరుగుతుందన్నారు. పార్టీలో చేరిన వారిలో దినకర్, అబ్దుల్ మజీద్, మద్దిలేటి, అక్బర్ ఉన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అబ్దుల్ రజాక్, నగర అధ్యక్షుడు నాగరాజు యాదవ్, తెలుగు యువత అధ్యక్షులు అబ్బాస్, పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు ముంతాజ్, జనసేన ఇన్‌చార్జి హర్షద్, పవన్, సీనియర్ నాయకులు రామాంజనేయులు, బాబ్జి, బూత్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

నారా లోకేశ్‌ను కలిసిన సీమ ఉద్యమ నాయకులు



నారా లోకేశ్‌తో సీమ ఉద్యమ నాయకుడు

కర్నూలు(అర్బన్), మార్చి 9: ఉమ్మడి అనంతపురం జిల్లాలో శంఖారావం కార్యక్రమంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను రాయలసీమ ఉద్యమ నాయకులు కలిశారు. శనివారం సీమ కృష్ణ ఆధ్వర్యంలో రాయలసీ మకు రావాల్సిన హక్కులు, నీళ్ల నిధులు, నియామకాల గురించి చర్చించారు. స్పందించిన నారా లోకేశ్ రాయలసీమ వాసులతో త్వరలో అమరావతిలో సమావేశం నిర్వహించి ప్రాంత అభివృద్ధి, సమస్యలపై చర్చించి ఆ మేరకు చేపట్టాల్సిన కార్యాచరణ ప్రకటిస్తామని హామీ ఇచ్చారు. రాయలసీమకు గుండ్రేవుల, వేదవతి, ఆర్డీఎస్, గురురాఘవేంద్ర, రాజోలి, సమాంతర కాలువ, వలసలు, నిరుద్యోగం గురించి చర్చించామని వారు తెలిపారు. కార్యక్రమంలో రాయలసీమ ఉద్యమ యువనాయకులు భూషణ్, రవింద్ర నాయక్, రాము, సుధాకర్, గణేష్, దస్తగిరి, ప్రవీణ్ నాయక్, గోపాల్, షేక్షా పాల్గొన్నారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలి



ప్రజానగర్‌లో హోమియో వైద్యశిబిరం నిర్వహిస్తున్న వైద్యులు

కర్నూలు(హస్పిటల్), మార్చి 9: వడదెబ్బ తగలకుండా ముందు జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని లైఫ్ హోమియోపతి వైద్యురాలు డాక్టర్ శిరిషారెడ్డి అన్నారు. శనివారం నగర శివారులోని బి.తాండ్రపాడులో టీవీ-9 కాలనీలో వడదెబ్బ నివారణ కోసం ఉచిత హోమియో వైద్యశిబి రాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ శిరిషారెడ్డి మాట్లాడుతూ అధిక ఉష్ణోగ్రత్తల్లో ఎక్కువ సేపు గడవడం వల్ల సన్ స్ట్రోక్ వస్తుందన్నారు. వడదెబ్బ ప్రాణాంతకకరమైనదని, అధిక ఉష్ణోగ్రత్తల్లో పని చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం కాలనీవాసులకు ఉచితంగా హోమియో మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యురాలు రాధిక, జాన్‌డేవిడ్, సిబ్బంది పాల్గొన్నారు.

సాయుధ బలగాల కవాతు



కవాతు నిర్వహిస్తున్న సాయుధ బలగాలు

కర్నూలు, మార్చి 9: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నగరంలో సాయుధ బలగాలు కవాతు నిర్వహించాయి. కర్నూలు డీఎస్పీ విజయశేఖర్, ట్రైనీ డీఎస్పీ భావన, టూటౌన్ సీఐ ఇంతియాజ్‌బాషా ఆధ్వర్యంలో కేంద్ర సాయుధ బలగాలు కవాత్తు నిర్వహించారు. టూటౌన్ పోలీస్‌స్టేషన్ నుంచి కొత్తపేట, కొండారెడ్డి బురుజు, కోర్టు కాంప్లెక్స్, చిరంజీవి పార్కు, మున్సిపల్ ఆఫీసు, ప్రకాష్‌నగర్ మీదుగా ఈ కవాతు జరిగింది. ప్రశాంత ఎన్నికలే లక్ష్యంగా ఈ కవాతు నిర్వహిస్తున్నామని డీఎస్పీ తెలిపారు.

12న జాబ్ మేళా

కర్నూలు(అర్బన్), మార్చి 9: సి.క్యాంప్ సెంటర్‌లోని జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో ఈనెల 12న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా అధికారి పి.దీప్తి ఒక ప్రకటనతో తెలిపారు. ఉదయం 10 గంటలకు ఐసీఐసీఐ బ్యాంక్, ఎనోవిజన్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీల్లో మేనేజర్, సెల్స్ ఎగ్జిక్యూటివ్స్, గార్డ్సు, అకౌంటెంట్స్, డీటీపీ ఆపరేటర్ల పోస్టులకు ఇంటర్, డిగ్రీ పూర్తి చేసి, 25 నుంచి 35 సంవత్సరాల వయస్సులోపు వారు అర్హులని, ఎంపికైన వారికి రూ. 20 వేల వేతనం ఉంటుందని ఆమె పేర్కొన్నారు.

టీడీపీ నాయకుడికి పరామర్శ

కర్నూలు(రూరల్), మార్చి 9: కోడుమూరు మండలం లద్దగిరి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు పట్టె కృష్ణను పార్టీ సీనియర్ నాయకుడు ఎదు రూరు విష్ణువర్దన్‌రెడ్డి, కోడుమూరు టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి శనివారం ఆసుపత్రికి వెళ్ళి పరామర్శించారు. పట్టెకృష్ణ శుక్రవారం సాయంత్రం కర్నూలు నుంచి బైక్‌పై స్వగ్రామమైన లద్దగిరికి బయలుదేరారు. చిన్నటేకూరు, ఉల్లింద కొండ మధ్యలో రాంగ్ రూట్‌లో ఎదురుగా వస్తున్న ఓ వ్యక్తి బైక్ ప్రమా దవశాత్తు కృష్ణ వెళ్తున్న బైక్‌ను ఢీకొట్టింది. ఈఘటనలో ఇద్దరికి తీవ్రగాయా లయ్యాయి. వెంటనే సమాచారం తెలుసుకున్న విష్ణు అనుచరులు ప్రమాదస్థ లానికి వెళ్లి గాయపడ్డ వారిని ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం కృష్ణ ఆరోగ్య పరిస్థితి నిలకడ గా ఉందని వైద్యులు చెప్పారు. శనివారం టీడీపీ సీనియర్ నా యకులు విష్ణువర్దన్‌రెడ్డి, టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి ఆసుపత్రికి వెళ్లి కృష్ణను పరామర్శించారు. ఆరోగ్య విషయాలను అక్కడి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు.

శస్త్ర చికిత్స విజయవంతం

కర్నూలు(హస్పిటల్), మార్చి 9: కొత్తబస్టాండు ఎదుట ఉన్న జెమ్‌కేర్ కామినేని హాస్పిటల్‌లో లైవ్ ఆర్థోస్కోపి సర్జరీ విజయవంతమైంది. శనివారం సాయంత్రం హాస్పిటల్ సీఈవో ఎస్‌వీ చంద్రశేఖర్, ఆర్థో సర్జన్ రవిబాబు, స్మిత్ నెఫ్యూ అకాడమి మేనేజర్ గురుప్రసాద్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆర్థోస్కోపి వైద్యులు ప్రథమేష్ జైన్, చింగ్‌తోంసే, ప్రదీప్ కుమార్‌ల చేత కామినేని హాస్పిటల్‌లో తీవ్రంగా మోకాలు నొప్పి సమస్యతో ఇబ్బంది పడు తున్న ముగ్గురు రోగులకు రూ.లక్ష విలువ చేసే ఆర్థోస్కోపి సర్జరిని ఉచితంగా చేశారని వివరించారు. కార్యక్రమంలో సీఈవో గణేష్, మార్కెటింగ్ డీజీఎం రమణబాబు, మార్కెటింగ్ జీఎం షేక్షావలి, హాస్పిటల్ ఆపరేషన్ హెడ్ నదీమ్ పాల్గొన్నారు.

టీడీపీ అధికార ప్రతినిధిగా జే రబ్బాని

కర్నూలు(అర్బన్), మార్చి 9: తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధిగా జే. రబ్బానిని నియమించారు. శనివారం మౌర్యఇన్‌లోని కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి టీజీ భరత్ నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీజీ భరత్ మాట్లాడుతూ యువతకు టీడీపీలో ప్రాధాన్యం ఉంటుందన్నారు. టీడీపీ, జన సేన ప్రభుత్వ ఏర్పడిన వెంటనే యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు.

నిరుపయోగంగా ఓవర్ హెడ్ ట్యాంకులు



అలంకారప్రాయంగా ఓవర్ హెడ్ ట్యాంక్

సి.బెళగల్, మార్చి 9: మండలం లోని ఇనగండ్ల, బ్రాహ్మణదొడ్డి, ముడుమాల, తిమ్మనదొడ్డి, సంగాల గ్రామాలలో గత టీడీపీ ప్రభుత్వం నిర్మించిన ట్యాంకులు నిరుపయోగంగా మారాయి. ఆయా గ్రామాలలో తాగునీటి సమస్యను తీర్చాలని ప్రజలు అధికారులకు, సర్పంచులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. గ్రామ పంచాయతీలకు నిధులు లేకపోవడంతో సర్పంచులు ఇప్పటికే అప్పు లలో కూరుకుపోయం తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక పోతున్నామని వాపోతున్నారు. గ్రామాలలో వీధి దీపాలు, పరిసరాల పరిశుభ్రత కోసం అప్పులు తెవాల్సిన పరిస్థితి దాపురిందన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చొరవ తీసుకుని ఆయా గ్రామాలలో తాగు నీటి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

'చర్యలు తీసుకోవాలి'

కర్నూలు(అర్బన్), మార్చి 9: బాబాసాహెబ్ అంబేడ్కర్ చనిపోయిన సంవ త్సరాన్ని తప్పుగా శిలాఫలకంపై వేసి దళితుల మనోభావాలను దెబ్బతీసిన వారిపై చర్యలు తీసుకోవాలని కర్నూలు పార్లమెంట్ ఐటీడీపీ అధ్యక్షులు గట్టు తిలక్ డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని పాతబస్టాండ్ సర్కిల్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి నిరసన తెలిపారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖపట్నం, నర్సీపట్నం నియోజ వర్గంలో గత నెల 24న కొత్తవీధి పెద్దబడ్డెపల్లి రోడ్డు ప్రారం భోత్స వంలో భాగంగా నాయకుల శిలాఫలకాలు అవిష్కరించారు. అందులో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ మరణించిన తేదీని తప్పుగా శిలాఫలకంపై ముద్రించడం దళితులపై చిన్న చూపేనని అన్నారు. కార్యక్రమంలో మందా అఖిల్, రంజిత్, శ్రీనివాసులు. రఫీక్, నగేష్ పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం : తుగ్గలి నాగేంద్ర



సమావేశంలో మాట్లాడుతున్న తుగ్గలి నాగేంద్ర

తుగ్గలి, మార్చి 9: పార్టీ కార్యకర్తలకు ఎల్లవేలలా అండగా ఉంటామని, ఎలాంటి కేసులు పెట్టినా భయపడవద్దని రాష్ట్ర శాలివాహన కార్పొరేషన్ మాజీ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఆయన నివాసంలో టీడీపీ మండల నాయకులతో పార్టీ భవిష్యత్ ప్రణాళికపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ నెల 13న తుగ్గలిలో టీడీపీ కార్యాలయంలో మండల టీడీపీ కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నారని, ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా టీడీపీ పత్తికొండ ఎమ్మెల్యే అభ్యర్థి కేఈ శ్యాంబాబు హాజరవుతారని తెలిపారు. ప్రతి కార్యకర్త, అభిమాని ఈ సమావేశానికి హాజరు కావాలని సూచించారు. సమావేశంలో టీడీపీ నాయకులు మనోహర్ చౌదరి, సురేష్ చౌదరి, తిమ్మయ్య చౌదరి, వెంకటస్వామి, వెంకటపతి, తిరుపాల్ నాయుడు, బాలన్న, శివరాముడు చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

వలస కూలీ మృతి

ఎమ్మిగనూరు రూరల్, మార్చి9: మండల పరిధిలోని శిరాలదొడ్డి గ్రామానికి చెందిన వలసకూలీ సునీత (40) శనివారం గుంటూరు జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా మరో మహిళలకు తీవ్రగాయాలయ్యాయి. సునీత భర్త చనిపోవటంతో పుట్టింటిలోనే ఉండేది. గ్రామంలో పనులు లేకపోవటంతో కొన్ని రోజుల క్రితం సునీత బంధువులతో కలిసి బతుకు తెరువు కోసం గుంటూరు జిల్లా అడవి తంగేడపాడు గ్రామానికి వలసవెళ్లింది. అయితే శనివారం గ్రామంలో రోడ్డు పక్కన దుస్తులు ఉతుకుతుండగా వేగంగా వచ్చిన ఓ కారు ఆమెను ఢీకొట్టింది. ప్రమాదంలో సునీతకు తీవ్రగాయాలై అక్కడిక్కడే మృతిచెందింది. ఆమెతో పాటు ఉన్న మరో మహిళ లతకు కాలు విరిగింది. మృతి చెందిన సునీతకు కుమార్తె ఉంది. గాయపడిన లతను సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

ఆలూరు, మార్చి 9: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఆర్డీఎఫ్ సంస్థ ప్రతినిధి నాగరాజు అన్నారు. శనివారం రిలయన్స్ ఫౌండేషన్ ఆకాంక్ష, ఆర్డీఎఫ్ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఆలూరు మండలంలోని కురవల్లి గ్రామంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా మహిళలందరూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు, అనంతరం ఆటల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన మహిళలకు బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సచివాలయ మహిళ సిబ్బందిని ఘనంగా సన్మానించారు. అనంతరం నాగరాజు మాట్లాడుతూ మహిళలు డిజిటల్ రంగంలో పురుషులు, మహిళలు అందరూ సమాన అవకాశాలు పొందాల్సిన అవసరం ఉందని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సచివాలయ మహిళా సిబ్బంది విష్ణువందన, ఇందిరా, గ్రామ సర్పంచ్ రవి, విద్య కమిటీ చైర్మన్ రాముడు, గోపాల్, ఆశావర్కర్, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

ముందస్తు అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

ఆదోని టౌన్, మార్చి 9: వికలాంగుల సంక్షేమం కోసం మందకృష్ణ మాదిగ చేపట్టిన వికలాంగుల సింహ గర్జన కార్యక్రమానికి హాజరు కావడానికి విజయవాడకు బయలుదేరిన తనను పోలీసులు ముందస్తు చర్యగా అరెస్టు చేయడం సబబుగా లేదని కర్నూలు జిల్లా వికలాంగుల సంక్షేమ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ఆర్గనైజింగ్ కార్యదర్శి కమతం వెంకటేష్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ, అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని, వికలాంగులు ముందస్తు అరెస్టులకు పాల్పడటం సరికాదన్నారు.

పీస్ పార్కులో ద్వాదశ జ్యోతిర్లింగాల ప్రదర్శన



ఆకట్టుకుంటున్న ద్వాదశ జ్యోతిర్లింగాలు

ఆదోని టౌన్, మార్చి 9: ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో పట్టణంలోని నెహ్రూ పీస్ పార్కులో మహాశివరాత్రి పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన ద్వాదశ జ్యోతిర్లింగాల ప్రదర్శనలో శనివారం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అతి పెద్ద శివలింగాన్ని ఏర్పాటు చేసి, దాని చుట్టూ ద్వాదశ జ్యోతిర్లింగాలను ఏర్పాటు చేసి, భక్తులకు వాటి చరిత్రను వివరించారు. పెద్ద శివలింగం లోపల ఏర్పాటు చేసిన మరో శివలింగం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. భారీ శంఖంపై కొలువైన శంఖు లింగేశ్వర స్వామిని ప్రజలు భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు.

కస్తూర్బా ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మద్దికెర, మార్చి 9: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో 6వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ జ్యోతి తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ 2024-25 విద్యాసంవత్సరానికి దరఖాస్తులను ఈ నెల 12 నుంచి స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 11వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే 7, 8, 9 తరగతుల్లో మిగిలిన సీట్ల కోసం కూడా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనాథలు, బడిబయట ఉన్న చిన్నారులు, బడి మానేసిన వారు పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ దారిద్రరేఖకు దిగువనున్న బాలికలకు మాత్రమే అర్హులని పేర్కొన్నారు.

ఘనంగా తిమ్మగురుడు ఫక్కీరప్ప స్వామి కల్యాణం

తుగ్గలి, మార్చి 9: భక్తుల ఇలవేల్పు తిమ్మగురుడు ఫక్కీరప్పస్వాముల కల్యాణ రథోత్సవం రమణీయంగా జరిగాయి. శనివారం బోడిబండలో స్వామికి కల్యాణంతోపాటు పూజలు చేశారు. భక్తుల సమక్షంలో ఉత్సవమూర్తులను రథంపై అధిష్టించి ముందుకు లాగారు. ఈ పూజ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు హైదరాబాదు చెందిన శ్రీరాములు అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు టీడీపీ సీనియర్ నాయకులు అప్పా వేణుగోపాల్, గోపాల్, సుదర్శన రెడ్డి, సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి, ఉప సర్పంచ్ రామాంజనేయులు, రామూ నాయక్, భీమా నాయక్, పశుల శ్రీరాములు, లక్ష్మణ్ నాయక్ తదితరులు ఉన్నారు.

మార్కండేయ స్వామి రథోత్సవం

ఎమ్మిగనూరు, మార్చి9: పట్టణంలోని తేరుబజారులో వెలసిన భక్త మార్కండేయ స్వామి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించిన రథంపై అధిష్టించి మేళతాళాలు, మంగళవాయిద్యాల మధ్య రథోత్సం నిర్వహించారు. సంఘం అధ్యక్షకార్యదర్శులు, విశ్వనాథ్ రమేష్, పోలే ప్రసాద్, సభ్యులు మాకం నారాయణ,శివదాసు పాల్గొన్నారు.

కుక్కల బారి నుంచి జింక పిల్లను కాపాడిన రైతులు

మంత్రాలయం, మార్చి 9: మంత్రాలయం మండలంలోని మాధవరం గ్రామ సమీపంలో స్టీల్ ఫ్యాక్టరీ వద్ద జింకపిల్లపై కుక్కలు దాడి చేస్తుండగా.. పొలంలో ఉన్న రైతులు మేకల పౌలు, నవీన్, కుక్కలను తరిమి, జింక పిల్లను ప్రాణాలను కాపాడారు. శనివారం పొలాల్లో పని చేస్తుండగా.. ఒంటరిగా ఉన్న జింక పిల్లపై కుక్కలు దాడి చేస్తుండగా.. గమనించిన రైతులు కుక్కల బారి నుంచి తప్పించి కాపాడి మాధవరం పోలీసులకు అప్పగించారు. పోలీసులు ఎం.తాండా ఫారెస్టు వాచర్ శంకర్‌నాయక్‌కు అప్పగించారు. జింకపిల్లను కాపాడిన రైతులను పోలీసులు, ఫారెస్టు అధికారులు అభినందించారు.

కమనీయం శివపార్వతుల కల్యాణం

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం జిల్లా వ్యాప్తంగా వివిధ ఆలయాల్లో శివనామస్మరణతో మారుమోగాయి. శివపార్వతుల విగ్రహాలను అలంకరించి కల్యాణాన్ని కమనీయంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఉత్సవమూర్తులను రథాలపై ఆశీనులు చేసి వైభవంగా రథయాత్రలు నిర్వహించారు.





చెన్నంపల్లెలో అశేష జనం మధ్య సాగుతున్న రథయాత్ర, గురుజాల రామలింగేశ్వర స్వామి రథోత్సవంలో మాజీ ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి

తుగ్గలి, మార్చి 9: మండల పరిధిలోని చెన్నంపల్లి ఆలయంలో శివపార్వతుల కళ్యాణాన్ని భక్తులు వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం తలారి శివ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. సాయంత్రం రథాన్ని చేయించిన దాత లక్ష్మీ సప్లయర్స్ గోపాల్ రెడ్డితో పాటు పత్తికొండ టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి కేఈ శ్యాంబాబు అశేష జనవాహిని మధ్య ఉత్సవమూర్తులను అధిష్ఠించిన రథాన్ని ముందుకు లాగారు. పురవీధుల గుండా ఊరేగించారు. మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ బత్తిన వెంకట్రాముడు, టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ ఉపాధ్యక్షుడు వెంకటపతి, గోపాల్ రెడ్డి, సర్పంచు రంగమ్మ, మాబాషా, వెంకటేశ్, లక్ష్మీనారాయణ చౌదరి, తలారి నాగన్న, శివ, రామయ్య, అక్బర్, తదితరులు ఉన్నారు.

శాంత మల్లేశ్వర, భ్రమరాంబిక కల్యాణం

ఆదోని (అగ్రికల్చర్): స్థానిక చిన్మయ మిషన్ ఆవరణలో శాంత మల్లేశ్వర భ్రమరాంబిక దేవి కల్యాణోత్సవం కన్నుల పండువగా జరిగింది. చిన్మయ మిషన్ స్వామీజీ బ్రహ్మకుమారి నారాయణ చైతన్య వేదమంత్రాల ఉచ్ఛరణలతో కల్యాణాన్ని జరిపించారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

వైభవంగా బుగ్గ సంగమేశ్వరుని రథోత్సవం

మద్దికెర: గ్రామ పరిధిలోని బుగ్గ సంగమేశ్వరుని రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. మహాశివరాత్రిలో భాగంగా బుగ్గ సంగమేశ్వరస్వామికి పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను రథంపై అధిష్టించి రథోత్సవాన్ని నిర్వహించారు.

దేవనకొండ: మండల కేంద్రంలోని శివాలయం, శంకర దేవాలయం ,రామస్వామి ఆలయాలలో శివపార్వతుల కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. అనతరం ఉత్సవ విగ్రహాలతో గ్రామంలో ఉరేగింపు చేశారు. శివ భక్తులు నందికోలుశావ, చిన్నారులు కలశాలతో ఆకట్టుకున్నారు. ఆలయాలలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

క్రిష్ణగిరి: చుంచు ఎర్రగుడి, లక్కసాగరం, కంబాలపాడు గ్రామాలలో శివ పార్వతుల కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. లక్కసాగరం గ్రామంలో ఆలయ ధర్మకర్తలు లక్కసాగరం లక్ష్మీరెడ్డి, రామక్రిష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఉమా మహేశ్వర స్వామి కల్యాణం నిర్వహించారు. అనంతరం ఆయా గ్రామాల్లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

రమణీయం..రామలింగేశ్వరుడి రథోత్సవం

నందవరం: సుప్రసిద్ధ శైవక్షేత్రం గురుజాల రామలింగేశ్వర స్వామి రథోత్సవం రమణీయంగా జరిగింది. ఆలయ నిర్వాహకులు, ఈవో దినేష్, అర్చకులు హంపిస్వామి, వేదపండితులు మాజీ ఆలయ చైర్మన్ నరసింహారెడ్డి, రాజారెడ్డి, జాన్, ఈరన్నలు మాజీ ఎంపీ బుట్టారేణుక, నీలకంఠ, శివారెడ్డిగౌడు, ముగతి సర్పంచు విరుపాక్షిరెడ్డిలను శాలువాలతో సన్మానించారు. అలాగే టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డిని ఆలయ అర్చకులు, టీడీపీ నాయకులు శివారెడ్డి ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం హోమం నిర్వహించారు. రథోత్సవం కొనసాగించారు. స్వామి వారిని పల్లకిలో ఊరేగిస్తూ రథంపై ఊరేగించారు. ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు ఇతర రాష్ట్రాలు, జిల్లాల ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

వైభవంగా తిమ్మప్పస్వామి రథోత్సవం

మంత్రాలయం : రచ్చుమర్రి, మాధవరం గ్రామాల్లోని తిమ్మప్పతాత, తిమ్మవ్వదూత రథోత్సవం వైభవంగా జరిగింది. మహాశివరాత్రిని పురస్కరించుకుని ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. తిమ్మవ్వ దూత చిత్రపటాన్ని పల్లకిలో ఊరేగించారు. జడ్పీటీసీ గోవిందమ్మ, ఎంపీటీసీ మజ్జిగ నరసమ్మ, సర్పంచ్ మేకల సుజాత, రోగెప్ప, బొజ్జప్ప తదితరులు పాల్గొన్నారు.

పులిగట్టు అంజనేయ స్వామి ఆలయంలో పూజలు

కౌతాళం: ఎరిగేరి గ్రామ పొలిమేరలో ఉన్న పులిగట్టు ఆంజనేయస్వామి ఆలయంలో ఘనంగా పూజలు నిర్వహించారు. ప్రతి ఏడు మాదిరే శివరాత్రి మరుసటి రోజున రౌడూరు గ్రామంలోని జట్టెప్ప తాత దేవాలయంలో ప్రత్యేక పూజలను నిర్వహిస్తారు. ఎరిగేరిలో గ్రామ ఆటో డ్రైవర్లు భక్తులకు అన్నదానం చేశారు.

ఘనంగా శివరాత్రి వేడుకలు

పెద్దకడుబూరు : దొడ్డిమేకల, మురవణి, బసలదొడ్డితో పాటు ఆయా గ్రామాల్లో శివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. దొడ్డిమేకల గ్రామంలోని చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన నిర్వహించారు. మహిళలు కలశాలతో రథోత్సాన్ని కోలాహలంగా నిర్వహించారు.

వైసీపీకి ఓటుతో బుద్ధి చెప్పాలి : కేఈ



చెన్నంపల్లిలో పర్యటించి టీడీపీ పథకాలు వివరిస్తున్న కేఈ

తుగ్గలి, మార్చి 9: రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తునన జగన్‌కు ఓటుతోనే బుద్ధి చెప్పాలని టీడీపీ పత్తికొండ ఎమ్మెల్యే అభ్యర్థి కేఈ శ్యాంబాబు అన్నారు. శనివారం మండల పరిధిలోని చెన్నంపల్లిలో ఆయన పర్యటించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బత్తిన వెంకట్రాముడు, ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటపతి, మాభాషాలు కేఈ శ్యాంబాబుకు గజమాల వేసి సన్మానం చేశారు. అలాగే గ్రామంలో పర్యటించి టీడీపీ మేనిఫెస్టోను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రశ్నించిన టీడీపీ నాయకులు, కార్యకర్తలపై కేసులు పెట్టడం తప్ప.. వైసీపీ చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. మద్యం, ఇసుక, మట్కా, పేకాటను వంటివాటి మాఫియాను పెంచి పోషించి ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో అలజడులు సృష్టిస్తున్నారన్నారు. ఈ అరాచకాలకు చరమగీతం పాడాలంటే వచ్చే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి చంద్రబాబును ముఖ్యమంత్రి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాజీ ఎంపీపీ వెంకటేశ్, తిరుపాల్ నాయుడు, లక్ష్మీనారాయణ చౌదరి, అక్బర్, రామయ్య, కోటేష్‌గౌడు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని విస్మరించిన వైసీపీ : బీవీ



16వ వార్డులో భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో బీవీ

ఎమ్మిగనూరు, మార్చి9: ఈ ఐదేళ్లలో రాష్ట్రాభివృద్ధి వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని 16వ వార్డులో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డులో ఇంటింటికీ తిరుగుతూ సమస్యలు తెలుసుకోవడంతోపాటు టీడీపీ సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. ఎమ్మిగనూరు పట్టణం అభివృద్ధిలో రాష్ట్రస్థాయిలో పేరుండేదని, ఈ వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ఆ పేరు కాస్త దిగువకు చేరిందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు కొండయ్య చౌదరి, మిఠాయి నరసింహులు, ముల్లా కలీముల్లా, రామకృష్ణనాయుడు, రంగస్వామిగౌడ్, చేనేత మల్లి, జహంగీర్, జయన్న, కామర్తి మహేష్ పాల్గొన్నారు.

●పోస్టర్లు విడుదల : ఆర్‌పీఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న నిరుద్యోగ గర్జన పోస్టర్లును మాజీ ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి విడుదల చేశారు. జాబు రావాలంటే.. బాబు రావాలన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు జగన్ ప్రతి ఏడాది జనవరిలో జాబ్ క్యాలండర్ ఇస్తామని ప్రకటించారన్నారు. అయితే ఐదేళ్లు గడచినా ఒక్క జాబ్ క్యాలండర్‌కూడా విడుదల చేయలేదని విమర్శించారు.

మేదరిమెట్ల సిద్ధం సభకు ఆర్టీసీ బస్సులు

● బస్సులు లేక ప్రయాణికుల అవస్థలు



ఆర్టీసీ డిపో వద్ద ఆందోళన చేస్తున్న గజ్జెహల్లి గ్రామస్థులు

ఆదోని (అగ్రికల్చర్), మార్చి 9: మహాశివరాత్రి పండుగ పూట ప్రయాణికులు ఆర్టీసీ బస్సులు దొరక్క అవస్థలు పడ్డారు. శనివారం ఆదోని ఆర్టీసీ డిపో నుంచి 18 బస్సులు బాపట్ల జిల్లా మేదరిమెట్లలో జరిగే సీఎం సిద్ధం సభకు ఈ బస్సులను తరలించారు. శ్రీశైలం మల్లన్నను దర్శించుకునేందుకు భక్తులకు బస్సులు దొరక్క ఇబ్బందులు పడ్డారు. శ్రీశైలం స్వామి వారిని దర్శించుకుని స్వస్థలాలకు వెళ్లేందుకు కూడా భక్తులకు బస్సులు లేవు. ఉదయం వందలాది మంది ఆదోని ఆర్టీసీ కొత్త బస్టాండ్ వద్ద ప్రయాణికులు బస్సుల కోసం పడిగాపులు కాచారు. ఎంతసేపటికి బస్సులు రాకపోవడంతో పక్కనే ఉన్న ఆర్టీసీ డిపో వద్దకు వెళ్లి తాము శ్రీశైలం నుంచి ఎలాగోలాగా ఆదోనికి చేరుకున్నామని ఇక్కడి నుంచైనా హొలగుంద మండలం గజ్జహల్లి గ్రామానికి పంపాలని ఆర్టీసీ అధికారులను కోరారు. బస్సులు లేవంటూ అధికారులు తేల్చి చెప్పారు. బస్సులన్నీ సీఎం జగన్ సిద్ధం సభ మేదరిమెట్లకు పంపామని సాయంత్రం మూడు గంటలకు మీ గ్రామానికి బసు ఉందని చెప్పారు. 9 గంటల నుంచి మధ్యాహ్నం మూడు వరకు ఉండలేమని, ఎలాగైనా బస్సును ఏర్పాటు చేయాలని కోరారు. తాము ఏమి చేయలేమని అధికారులు తేల్చిచెప్పడంతో అక్కడే ప్రయాణికులు ఆందోళనకు దిగారు. రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ పోలీసులు అక్కడ చేరుకొని ప్రయాణికులకు నచ్చచెప్పి బస్టాండ్‌కు పంపారు. ప్రయాణికులు సిద్ధం సభకు బస్సులో తరలించడంపై అసహనాన్ని వ్యక్తం చేశారు. మధ్యాహ్నం ఆర్టీసీ బస్సును ఏర్పాటు చేసి గ్రామాలకు పంపారు.

నిందితులను రక్షిస్తున్న ఎమ్మెల్యే

● ఆరు రోజులవుతున్నా ఎందుకు అరెస్టు చేయలేదు?
● దళితులపై దాడి చేసిన వ్యక్తికి రాచమర్యాదలు చేస్తున్న పోలీసులు
● టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ధరూరు జేమ్స్



జయమ్మను ఆసుపత్రిలో పరామర్శిస్తున్న ధరూరు జేమ్స్

ఆదోని, మార్చి 9: దళిత మహిళపై, ఆమె కుమారులపై తీవ్రంగా దాడి చేసి, కులం పేరుతో దూషించిన వ్యక్తిని ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి రక్షించే ప్రయత్నం చేయడం దారుణమని టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ధరూరు జేమ్స్, ఎస్సీ సెల్ రాష్ట్ర సెక్రెటరీ విజయకుమార్, ఈరన్న, నరసప్ప, జైరాం, రాము, లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం వైసీపీ నాయకుడు పురుషోత్తం రెడ్డి చేతిలో దాడికి గురై స్థానిక ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దళిత మహిళ జయమ్మను వారు పరామర్శించి ఘటన పూర్వాపరాలను అడిగి తెలుసుకున్నారు. డ్యూటీ డాక్టర్‌తో మాట్లాడి జయమ్మకు మెరుగైన చికిత్స అందించాలని కోరారు. అనంతరం ఎస్సై శ్రీనివాసులతో అరెస్టు విషయంపై మాట్లాడారు. అనంతరం విలేకరులతో ధరూరు జేమ్స్ మాట్లాడారు. దళిత మహిళపై దాడి చేసిన వ్యక్తి ఎమ్మెల్యే ముఖ్య అనుచరుడు కావడంతో ఆరు రోజులు అవతున్నా పోలీసులు అరెస్టు చేయయకపోవడం వెనక మతలబు ఏమిటని ప్రశ్నించారు. మైనర్ బాలుడిపై కూడా వైసీపీ నాయకుడు దాడి చేయడం, అలాంటి వ్యక్తికి స్థానిక ఇస్వి పోలీస్ స్టేషన్‌లో పోలీసులు రాచమర్యాదలు చేయడం ఏమిటని నిలదీశారు. రాబోయే 2024 ఎన్నికల్లో వైసీపీ పార్టీకి దళితులందరూ గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. దాడి చేసిన పురుషోత్తం రెడ్డిని వెంటనే అరెస్టు చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో దళిత సంఘం నాయకులు మదిరె వీరేష్, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు నరసప్ప, రాము, బాలాజి, బాలస్వామి, రామకృష్ణ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పదవులను కేటాయించాలి

ఆదోని టౌన్, మార్చి 9: జంగమ వీరశైవ సమాజానికి చెందిన వారికి రాజకీయ పదవులు కట్టబెట్టడంలో అన్ని పార్టీలు వెనుక పడి ఉన్నాయని జంగమ, వీరశైవ హక్కుల పోరాట సమితి నాయకులు ఎండీ బద్రీనాథ్ స్వామి, మల్లికార్జున, అన్నారు. శనివారం వీరు మాట్లాడుతూ, రాజకీయాలలో జంగమ వీర శైవులను ఎన్నికల సమయంలో వాడుకోవడం తప్ప, పదవుల పంపిణీలో దూరంగా ఉంచడం ఎంతో బాధాకరమన్నారు. పత్తికొండ పర్యటనకు వచ్చిన నారా భువనేశ్వరిను తాము మర్యాదపూర్వకంగా కలిసి టీడీపీలో తమ సామాజిక వర్గానికి చెందిన వారికి ఈసారి ఎమ్మెల్సీ పదవుల కేటాయింపులో ప్రాధాన్యత ఇవ్వాలని కోరామని, అందుకు ఆమె సానుకూలంగా స్పందించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. విశ్వనాథ్ గౌడ్, మంజునాథ్, కన్నె జగదీష్ పాల్గొన్నారు

ఆలూరులో టీడీపీ జెండా ఎగురవేద్దాం

● టీడీపీ మాజీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్



కార్యకర్తలతో కలిసి నినాదాలు చేస్తున్న ఇన్‌చార్జి వీరభద్రగౌడ్

ఆలూరు, మార్చి 9: రానున్న ఎన్నికల్లో ప్రతి కార్యకర్త పార్టీ గెలుపు కోసం కష్టపడి పని చేసి రాష్ట్రానికి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేద్దామని ఆలూరు మాజీ టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ పిలుపునిచ్చారు. శనివారం ఆదోనిలో ఉన్న ఆయన వ్యక్తిగత కార్యాలయనికి ఆలూరు టీడీపీ టిక్కెట్ పై అధిష్టానం స్పష్టత ఇచ్చిందనే సమాచారంతో ఆలూరు నియోజకవర్గ టీడీపీ కార్యాకర్తలు ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ఎన్నికల్లో జగన్ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

గోనెగండ్ల, మార్చిచ 9: మండల పరిధిలోని గోనెగండ్ల, గంజహళ్లి గ్రామాల మధ్య ఉన్న మద్దికుండ దగ్గర కర్ణాటక మద్యంను అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నట్లు సీఐ రామకృష్ణయ్య తెలిపారు. చిన్నమరివీడు గ్రామానికి చెందిన బోయ సునిల్, గోనెగండ్లకు చెందిన బోయ రంగస్వామి లు అక్రమంగా కర్ణాటక నుంచి 35 టెట్రాపాకెట్ల బాక్స్‌లను తరిలిస్తుండగా దాడిచేసి పట్టుకున్నట్లు తెలిపారు. 35 బాక్స్‌ల తోపాటు ఏపీ21 ఎస్ 4899 అనే ద్విచక్రవాహనంను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

మంత్రాలయం, మార్చి 9: తుంగభద్ర నది ఒడ్డున ఆదోని మండలంలోని పెద్దతుంబళం గ్రామానికి చెందిన హనుమప్ప, దుర్గమ్మ అనే ఇద్దరు వ్యక్తులు కర్ణాటక నుంచి అక్రమంగా కర్ణాటక మద్యం తెస్తుండగా మంత్రాలయం ఎస్ఐ గోపీనాథ్ పట్టుకున్నారు. శనివారం గంగమ్మ గుడి వద్ద నది దాటుతూ 3 బాక్సులోని 288 కర్నాటక 90 ఎంఎల్ మద్యం టెట్రా ప్యాకెట్లును స్వాధీనం చేసుకొని ఇద్దరిని అరెస్టు చేశారు. నిందితుల్ని ఎమ్మిగనూరు కోర్టులో హాజరు పరచగా రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

మంత్రాలయంలో పోటెత్తిన భక్తులు



రాఘవేంద్రుని దర్శనానికి తరలివచ్చిన భక్తులు

మంత్రాలయం, మార్చి 9 : ప్రముఖ పుణ్యక్షేత్రమైన మంత్రాలయ రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులతో సందడిగా మారింది. శుక్ర, శని, ఆదివారం సెలవు దినం కావటంతో దక్షిణాది రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. రెండు రోజుల నుంచి భక్తుల సంఖ్య పెరుగుతూ వచ్చింది. అన్నపూర్ణ భోజనశాల, మహాముఖ ద్వారం, మధ్వమార్గ్ కారిడార్, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, తుంగభద్ర నది తీరం భక్తులతో కోలాహలంగా మారింది.

శ్రీమఠానికి వెండి దీపాలు విరాళం

రాఘవేంద్రస్వామి మఠానికి నంద్యాలకు చెందిన గురు రాఘవేంద్ర బ్యాంకు కోచింగ్ సెంటర్ చైర్మన్ దస్తగిరి రెడ్డి, అతని తనయులు మౌలాలి రెడ్డి, శావల్ రెడ్డి 12.349 కేజీల వెండితో 4.5 అడుగుల ఎత్తులో ప్రత్యేకంగా తయారు చేయించిన రెండు దీపాలను విరాళంగా ఇచ్చారు. శనివారం రాత్రి కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని వెండి దీపాలను మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులకు అంద జేశారు.

టీడీపీ తోనే బీసీల అభివృద్ధి



ఎన్టీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

గోనెగండ్ల, మార్చి 9: టీడీపీ తోనే బీసీ ల అభివృద్ధి సాధ్యమని ప్రతి బీసీ టీడీపీ కి ఓటు వేసి గెలిపించాని టీడీ పీ మండల కన్వీనర్ నజీర్‌సాహెబ్, ప్రధాన కార్యదర్శి తిరుపతయ్యనాయుడు, మైనార్టీ నాయకులు బేతాలబడేసా కోరారు. శనివారం స్థానిక టీడీపీ కార్యలయ ప్రాంగణంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ చిత్రపటానికి నాయకులు, కార్యకర్తలు క్షీరాభిషేకం చేశారు. మాజీ ఎంపీపీ గాజులదిన్నె హనుమంతు, జయపాల్, రంగస్వామినాయుడు, భారతంబడేసా, ఫక్రుద్దీన్, జయపాల్, హెచ్ కైరవాడి పెద్దయ్య, చాంద్‌బాషా, మదీనా, వెంకటకృష్ణమనాయుడు, లింగందిన్నె నాయుడు తదితరులు పాల్గొన్నారు.